ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
బుధవారం 23 ఏప్రిల్ 2025



సిద్దవటం మండలంలో తోపుడు బండిపై బిందెలతో నీటిని తీసుకెళుతున్న మహిళ

కార్డెన్‌సెర్చ్‌లో 25 వాహనాలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలతో పీలేరు అర్బన్ పోలీసులు

పీలేరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): పీలేరు పట్టణం బండ్లవంక ప్రాంతంలో మంగళవారం ఉదయం నిర్వహించిన కార్డెన్‌సెర్చ్‌లో సరైన రికార్డులు లేని 25 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు పీలేరు అర్బన్ సీఐ యుగంధర్ తెలిపారు. శాంతిభద్రతలు, మత్తు పదార్థాల నియంత్రణలో భాగంగా బండ్లవంకలో కార్డెన్ సెర్చ్ నిర్వహించినట్లు ఆయన తెలిపారు. అంతేకాకుండా నాటుసారా, గంజాయి వంటి మత్తు పదార్థాల కోసం అనుమానితుల ఇళ్లలో తనిఖీలు నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా ఆయన స్థానికులతో మాట్లాడుతూ అనుమానాస్పద వ్యక్తులు, వారి కదలికల గురించి పోలీసులకు సమాచారం అందించాలన్నారు. అనంతరం మత్తు పదార్థాల నియంత్రణ కోసం రూపొందించిన క్యూఆర్ కోడ్ వ్యవస్థ, మహిళల భద్రత కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు బాలకృష్ణ, లోకేశ్, తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు సకాలంలో చెల్లించాలి

● కలెక్టరేట్ ఎదుట సీహెచ్‌వోల నిరసన



కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేస్తున్న సీహెచ్‌వోలు

రాయచోటి (కలెక్టరేట్), ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్యశాఖలోని ఎన్‌హెచ్‌ఎం కింద సీహెచ్‌వోలుగా పనిచేస్తున్న సిబ్బందికి వేతనాలు సకాలంలో చెల్లించాలని మంగళవారం వారు కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి విలేజ్ క్లీనిక్‌లలోని సీహెచ్‌వోలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 6 సంవత్సరాలు దాటిన సీహెచ్‌వోలను క్రమబద్ధీకరించాలని, ఎన్‌హెచ్‌ఎంలోని ఇతర ఉద్యోగులతో సమానంగా 23 శాతం ఇంక్రిమెంట్ ఇవ్వాలని కోరారు. ప్రతి నెలా వేతనంతో పాటు ఇన్సెంటివ్ ఇవ్వాలని, ప్రతి సంవత్సరం 5 శాతం ఇంక్రిమెంట్ ఇవ్వాలని, ఆర్థిక, ఆర్థికేతర సమస్యలను తీర్చే హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్లు తీర్చే వరకు నిరసనలు కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీఎంసీఏ రాష్ట్ర కార్యదర్శి, ఏపీఎంసీఏ కడప అధ్యక్షుడు, జిల్లా కమ్యూనిటీ హెల్త్ అధికారులు పాల్గొన్నారు.

కమ్ముకొస్తున్న నీటి ఎద్దడి



రామసముద్రం మండలంలో దిగుడుబావి నుంచి నీళ్లు తెచ్చుకుంటున్న మహిళలు

- ప్రత్యామ్నాయంగా ట్యాంకర్లతో సరఫరా..
- రాయచోటి నియోజకవర్గంలో అధిక సమస్య
- జిల్లాలో పలుచోట్ల తీవ్రం
- మండుతున్న ఎండలతో తగ్గుతున్న భూగర్భజలం

ఓవైపు ఎండలు మండుతున్నాయి.. భూగర్భజలాలు అడుగంటడంతో జిల్లాలో పలు గ్రామాల్లో నీటి ఎద్దడి కమ్ముకొస్తోంది. దీంతో ప్రత్యామ్నాయంగా అధికారులు ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తున్నారు. కొన్నిచోట్ల ప్రజలే ట్యాంకర్ల నుంచి నీళ్లు కొనుగోలు చేసుకుంటున్నారు. ఇంకొందరు వ్యవసాయ బావులు, పొలాల వద్ద ఉన్న వ్యవసాయబోర్ల వద్ద నుంచి నీళ్లు తెచ్చుకుంటున్నారు. ఏప్రిల్ మూడవ వారం నాటికే పరిస్థితి ఇంత తీవ్రంగా ఉంటే.. రాబోయే మే నెలలో పరిస్థితి ఇంకెంత దారుణంగా ఉంటుందో? ఊహించుకుంటేనే భయంగా ఉందని పలువురు ఆందోళన చెందుతున్నారు. గత ఏడాది నీటి సరఫరా చేసిన బిల్లులు దాదాపు రెండు కోట్ల వరకు బకాయిలు ఉన్నాయని.. ఇప్పుడు మళ్లీ సరఫరా చేస్తున్నాం.. ఈసారైనా బిల్లులు సకాలంలో ఇవ్వాలని ట్రాక్టర్ల యజమానులు కోరుతున్నారు.

(రాయచోటి/రాయచోటి టౌన్-ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా మంచినీటి ఎద్దడి ముంచుకొస్తోంది. ఎండలు మండిపోతుండటంతో భూగర్భజలాలు తగ్గిపోయి బోర్లన్నీ చుక్కనీరు లేక ఎండిపోతున్నాయి. గత ఏడాది వర్షాలు తక్కువగా కురవడంతో చెరువులు, కుంటల్లో నీటి జాడ లేదు. దీంతో పల్లె జనం నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రామసముద్రం మండలం ఆర్.నడింపల్లె పంచాయతీ శ్రీరాములపల్లె, మాలేనత్తం పంచాయతీ చింపరపల్లెలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. శ్రీరాములపల్లెలో నాలుగు నెలల కిందట తాగునీటి కోసం వేసిన బోరుబావిలో నీళ్లు తగ్గిపోయి సన్నగా వస్తున్నాయి. ఈ బోరు బావి గ్రామానికి కిలోమీటర్ దూరంలో ఉండడంతో అక్కడికి వెళ్లి బిందె నీళ్లు తేవాలంటే.. గంటల సమయం పడుతోందని గ్రామస్థులు వాపోతున్నారు. పది రోజుల కిందట బోరు మోటారు మార్చినా నీళ్లు రావడం లేదు. దీంతో గ్రామం నుంచి సుమారు రెండు కిలోమీటర్ల దూరంలోని వ్యవసాయ పొలంలో ఉన్న దిగుడు బావి నుంచి నీళ్లు తెచ్చుకుంటున్నారు. ఈ బావి లోని నీళ్లు కలుషితమై ఉన్నా విధిలేని పరిస్థితుల్లో ఈ నీళ్లనే తాగాల్సి వస్తోందని గ్రామస్థులు వాపోతున్నారు. ఈ బావిలోకి దిగడానికి మహిళలు భయపడి మగవాళ్లు తోడు ఉంటేనే వెళుతున్నారు. నీళ్ల కోసం చంటిబిడ్డలను చంకన పెట్టుకుని వెళ్లాల్సి వస్తోందని మహిళలు వాపోతున్నారు. సిద్దవటం మండలం శాఖరాజుపల్లెలో పొలాల నుంచి తోపుడు బండ్లపై మహిళలు నీళ్లు తెచ్చుకుంటున్నారు. తంబళ్లపల్లె మండలం ఇట్నేనివారిపల్లె వద్ద ఉన్న ప్రభుత్వ లేఅవుట్లో తీవ్ర నీటి సమస్య ఉంది. ఇక్కడ ప్రస్తుతానికి ఇరవై కుటుంబాల వరకు నివాసం ఉంటున్నాయి. సరైన నీటి వసతి లేకపోవడంతో ఇళ్ల నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయి. నివాసం ఉంటున్న లబ్ధిదారులు ట్రాక్టర్ రూ.600 చెల్లించి నీటిని కొనుగోలు చేస్తున్నారు. పెద్దమండ్యెం మండలంలోని ఎన్‌వో పల్లె పంచాయతీ మిట్టావాండ్లపల్లెలో తాగునీటి పథకం బోరులో కేవలం 20 నిమిషాల పాటు మాత్రమే నీళ్లు వస్తున్నాయి. కొందరు వ్యవసాయబోర్ల వద్ద నుంచి నీళ్లు తెచ్చుకుంటున్నారు. ఆ గ్రామం సమీపంలోని బండపైన ఇల్లు ప్రజలు ట్యాంకర్లతో నీళ్లు కొనుగోలు చేస్తున్నారు.

రాయచోటి నియోజకవర్గంలో సమస్య తీవ్రం

గ్రామీణ రక్షిత మంచినీటి పథకం అధికారుల లెక్కల ప్రకారం జిల్లాలో 49 గ్రామాలలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. అందులో 48 గ్రామాలు రాయచోటి నియోజకవర్గంలోనే ఉండడం విశేషం. మదనపల్లె, రాజంపేట డివిజన్‌లోని 30 మండలాల్లో 4896 రక్షిత మంచినీటి పథకాలు, 8799 చేతిపంపులు ఉన్నాయి. ప్రస్తుతం 3099 చేతిపంపులు మాత్రమే పనిచేస్తున్నాయి. మిగిలిన వాటిలో కొన్ని వర్షాకాలంలో పనిచేస్తుండగా వేసవికాలంలో పూర్తిగా పనిచేయడం లేదు. ప్రస్తుతం 45 చేతిపంపులకు మరమ్మతులు చేయాల్సి ఉంది జిల్లాలో చాలా నీటి పథకాలు, చేతి పంపులు వర్షాకాలంలో మాత్రమే పనిచేస్తుండగా వేసవి వచ్చిందంటే తాగునీటి సమస్య ఎదుర్కోక తప్పడం లేదని గ్రామీణ ప్రాంత ప్రజలు వాపోతున్నారు.

పెండింగ్‌లో రూ.2 కోట్ల తాగునీటి బిల్లులు

తాగునీటి సమస్య ఎదుర్కొంటున్న గ్రామాలలో అధికారులు ప్రత్యామ్నాయంగా ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తున్నారు. జిల్లాలో 49 గ్రామాల్లో నీటి ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. రాయచోటి నియోకవర్గంలోని సంబేపల్లె, చిన్నమండెం, గాలివీడు, లక్కిరెడ్డిపల్లె, రామాపురం, రాయచోటి మండలాల్లోని 48 పల్లెల్లో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా జరుగుతోంది. గత ఏడాది ఏప్రిల్ నెల నుంచి జూన్ నెల వరకు ట్యాంకర్ల ద్వారా గ్రామీణ ప్రాంత ప్రజలకు తాగునీటిని సరఫరా చేసిన ట్యాంకర్ల యజమానులకు సుమారు రూ.2 కోట్లకుపైగా బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. దీనిపైన ట్యాంకర్ యజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



సంబేపల్లె మండలం నారాయణరెడ్డిగారిపల్లెలో ట్యాంకర్లతో నీటిని అందిస్తున్న దృశ్యం

రూ.7.95 కోట్లతో నివేదికలు

జిల్లాలో వేసవిలో తాగునీటి సమస్య లేకుండా చూసేందుకు సమ్మర్ ప్లాన్ కింద రూ.7.95 కోట్లతో ప్రభుత్వానికి నివేదికలు పంపించాం. పల్లెల్లో ఎక్కడా సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. తీవ్ర తాగునీటి ఎద్దడి గల గ్రామాల్లో ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేయడంతో పాటు రైతుల బోర్ల నుంచి కూడా తాగునీటిని అందించేందుకు ఇప్పటికే నివేదికలు తయారు చేశాం. ఈ వేసవిలో జిల్లా వ్యాప్తంగా ఎక్కడా తాగునీటి సమస్య లేకుండా చూస్తాం.

-పీవీ ప్రసన్నకుమార్, ఎస్‌ఈ, ఆర్‌డబ్ల్యుఎస్

భోగంపల్లె రిజర్వాయర్ వద్ద హెచ్చరిక బోర్డులు



వాల్మీకిపురం రిజర్వాయర్ వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్న ఈవో రవీంద్రనాథ్

వాల్మీకిపురం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం పట్టణ సమీపంలోని భోగంపల్లె రిజర్వాయర్ వద్ద ఇసుక అక్రమ తవ్వకాల పట్ల అధికారులు వేగవంతంగా చర్యలు చేపట్టారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు స్థానిక గ్రామ పంచాయతీ, పోలీసు శాఖ ఆధ్వర్యంలో రిజర్వాయర్ వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ప్రాజెక్టు ప్రాంతంలో ఇసుక తవ్వకాలు, రవాణా చట్టరీత్యా నేరమని ఉల్లంఘించిన వారు ఎంతటివారైనా ఉపేక్షించక క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని బోర్డులలో పొందుపరిచారు. పట్టణానికి తాగునీటి సరఫరా చేసే బోరు బావుల చెంత ఇసుక అక్రమ తవ్వకాల పట్ల అధికారులు చర్యలు తీసుకోవడంతో పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో పంచాయతీ ఈవో రవీంద్రనాథ్, ఈవోఆర్డీ సుధాకర్ రెడ్డి, పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలపై కదిలిన అధికారులు

- ఆంధ్రజ్యోతి కథనంపై జేసీ ఆరా
- మళ్లీ సమగ్ర విచారణ

పీలేరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): పీలేరు పట్టణ పరిధిలోని ప్రభుత్వ కాలనీల్లో వెలుగు చూస్తున్న ఆక్రమణలపై రెవెన్యూ యంత్రాంగం కదిలింది. కూటమి ప్రభుత్వం కొలువుతీరిన అనంతరం ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి, జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిర్వహించిన క్షేత్రస్థాయి విచారణ నివేదికలతో మరోమారు కాలనీల్లో విచారణ జరిపేందుకు అధికారులు సమాయత్తం అవుతున్నారు.

'పీలేరులో మళ్లీ ఆక్రమణల కలకలం' పేరిట మంగళవారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఆ కథనం గురించి జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ పీలేరు రెవెన్యూ అధికారుల వద్ద ఆరా తీసినట్లు తెలిసింది. దీంతో అప్రమత్తమైన స్థానిక అధికారులు గతంలో తాము నిర్వహించిన క్షేత్రస్థాయి విచారణ నివేదికల గురించి జేసీ వద్ద ప్రస్తావించినట్లు తెలిసింది. ఆ నివేదిక ఆధారంగా అనుమానాలు ఉన్న చోట మరోమారు విచారణ జరపాలని జేసీ ఆదేశించినట్లు తెలిసింది. అయితే ఈ విషయంపై తహసీల్దారు భీమేశ్వరరావు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పీలేరు మండల వ్యాప్తంగా 43 లేఔట్లు ఏర్పాటు చేసి వాటిల్లో 15 వేల ఇళ్ల పట్టాలు మంజూరు చేశారన్నారు. పెద్దఎత్తున మంజూరైన ఇళ్ల పట్టాలలో పెద్దఎత్తున అవకతవకలు జరిగినట్లు గతంలో తాము నిర్వహించిన విచారణలో తేలినట్లు తెలిపారు.

లక్కీ డిప్ స్లిప్ ఒకరి పేరిట, పట్టా నెంబరు ఇంకొకరి పేరిట, హౌసింగ్ మంజూరు మరొకరి పేరిట ఉన్నట్లు కనుగొన్నామన్నారు. అంతేకాకుండా 2019కు మునుపు ఇచ్చిన కాలనీల్లో చాలామంది నిబంధనలను ఉల్లంఘించి తమకిష్టమొచ్చిన రీతిలో నిర్మాణాలు చేపట్టినట్లు కూడా తేలిందన్నారు. వీటన్నింటిపైనే కాకుండా ఇటీవల జరిగిన ఆక్రమణల గురించి కూడా సమగ్రంగా విచారణ జరిపి ఉన్నతాధికారులకు తెలియజేస్తామన్నారు. వారి ఆదేశాల మేరకు ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

బరితెగిస్తున్న మట్టి మాఫియా...



గుట్టలో మట్టిని తవ్వుతున్న దృశ్యం

- కొండలు...చెరువుల్లో అక్రమ తవ్వకాలు
- అడ్డుకుంటే రెవెన్యూ సిబ్బందికి బెదిరింపులు
- నిబంధనలకు విరుద్ధంగా మట్టి తరలింపు

కురబలకోట, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మట్టి మాఫియా బరి తెగిస్తోంది. తమను ఎవరూ పట్టించుకోరనే ధీమానో లేక తమను ఎవరు ఏం చేస్తారులే అనే ధైర్యమో తెలియదు కానీ ఇష్టానుసారంగా రెచ్చిపోతున్నారు. తమ లాభార్జన కోసం నిబంధనలను ఏమాత్రం పాటించకుండా రాత్రింబవళ్లు మట్టిని తరలించి దర్జాగా సొమ్ము చేసుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మట్టి మాఫియా మరింతగా రెచ్చిపోతోంది. అక్రమ మట్టి రవాణాను రెవెన్యూ అధికారులు ఎప్పటికప్పుడు అడ్డుకోవడానికి యత్నిస్తున్నప్పటికీ వారి ప్రయత్నాలు ఏమాత్రం ఫలించడం లేదు. అంతేకాకుండా సెలవు రోజుల్లో మరింతగా రెచ్చిపోతున్నారు. మండల పరిధిలో కొంతమంది మట్టి వ్యాపారులు కొండలు, గుట్టలు, చెరువులలో యథేచ్ఛగా తవ్వకాలు జరిపి ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. సాధారణంగా మట్టిని చెరువులు, గుట్టలు, కొండలలో తవ్వకాలు చేసుకోవడానికి మైనింగ్, ఇరిగేషన్ శాఖాధికారుల నుంచి అనుమతులు పొందాల్సి ఉంటుంది. అంతేకాకుండా దీనికి ప్రభుత్వానికి కొంత సొమ్మును చెల్లించాల్సి ఉంటుంది. అయితే ఈ నిబంధనలను ఏమాత్రం పట్టించుకోకుండా తమ ఇష్టానుసారంగా మట్టిని తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. మండల పరిధిలోని అంగళ్లు సమీపంలోని కుందేలు గుట్ట, గుర్రాలవారిపల్లె, రంగమ్మ చెరువు, కురబలకోట సమీపంలోని ఊరగుట్ట, తెట్టు సమీపంలో గుట్టల నుంచి భారీగా మట్టిని తరలిస్తున్నారు. కాగా ఈ మట్టిని రియల్ ఎస్టేట్ వ్యాపారుల భూములకు, ఇటుకల బట్టీలకు తరలిస్తున్నారు. కొంతమంది స్థానికులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా, అడ్డుకోవడానికి ప్రయత్నించినా మట్టి మాఫియా రెవెన్యూ అధికారులపై దౌర్జన్యానికి దిగుతున్నట్లు తెలుస్తోంది. అంతేకాకుండా రెవెన్యూ అధికారులు ధైర్యం చేసి పోలీసులకు ఫిర్యాదు చేసినా రాజకీయ నేతలు జోక్యం చేసుకుని ఫిర్యాదును ఉపసంహరించుకునేలా రెవెన్యూ అధికారులపై ఒత్తిడి తెస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. దీంతో రెవెన్యూ అధికారులు చేసేదేమీ లేక చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. కాగా మట్టి తరలింపు విషయమై తాత్కాలికంగా రెవెన్యూ అధికారులు అడ్డుకోవడంతో వీఆర్‌వోపై దౌర్జన్యానికి పాల్పడి అతడిని నానా దుర్భాషలాడారు. దీంతో రెండు ఎక్స్‌కవేటర్లు, 7 ట్రాక్టర్లను సీజ్ చేశారు. కాగా ప్రస్తుతానికి మట్టి తరలింపును అడ్డుకున్నా మళ్లీ యథావిధిగా జరిగే అవకాశాలు ఉన్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో మట్టి తరలిపోకుండా అధికారులు ఏమాత్రం అడ్డుకుంటారో వేచి చూడాల్సిందే. ఈ విషయమై తహసీల్దార్ తపస్వినిని వివరణ కోరగా నిబంధనలకు విరుద్ధంగా మట్టిని తరలిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. అంతేకాకుండా ఎవరైనా మట్టిని అక్రమంగా తరలిస్తే తమకు ఫిర్యాదు చేయాలన్నారు.





సీజ్ చేసిన ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్లు

ముగ్గురు వీఆర్వోల సస్పెన్షన్

- తహసీల్దార్‌కు షోకాజ్ నోటీసులు
- ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్ శ్రీధర్



మదనపల్లె/కలికిరి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): విధుల్లో నిర్లక్ష్యం, అక్రమాలకు పాల్పడ్డారన్న ఆరోపణలతో మదనపల్లె మండలంలో ఇద్దరు వీఆర్వోలు, కలికిరి మండలంలో ఒకరిని కలెక్టర్ చామకూరి శ్రీధర్ సస్పెండ్ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. మదనపల్లె మండలంలోని మండలంలోని కొత్తవారిపల్లె వీఆర్వో భరత్, పెంచుపాడు వీఆర్వో శ్రీనివాసులురెడ్డిలను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. మ్యుటేషన్‌కు సంబంధించి రైతుల నుంచి డబ్బులు తీసుకున్నారన్న అభియోగంపై వీఆర్వో భరత్‌పై చర్యలు తీసుకున్నారు. బి.కె.పల్లె సర్వేనెంబర్-448, బసినికొండ రెవెన్యూ గ్రామంలోని తండ్రి భూమిని, ముగ్గురు కుమారులు భాగపరిష్కారం చేసుకోగా, వారి పేరున మ్యుటేషన్ చేశారు. ఇందుకోసం రూ.5 లక్షలు డబ్బులు తీసుకున్నారనే ఆరోపణలు వచ్చాయి. వాటిపై విచారణ చేపట్టిన అధికారులు తమకు సంబంధం లేని రెవెన్యూ గ్రామంలో కలుగజేసుకుని, మ్యుటేషన్ చేయించారని కలెక్టర్‌కు నివేదిక ఇచ్చారు. దీనిపై ఈ మేరకు మంగళవారం కలెక్టర్ చర్యలు తీసుకున్నారు. అలాగే పెంచుపాడు వీఆర్వో శ్రీనివాసులు రెడ్డి విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించారన్నది ప్రధాన అభియోగం. గతేడాది డిసెంబరులో జరిగిన రెవెన్యూ సదస్సుల్లో రైతులు, ప్రజల నుంచి వచ్చిన అర్జీలను సకాలంలో పరిష్కరించలేదని, పెండింగ్ వాటిపై శ్రద్ధ చూపలేదంటూ సస్పెండ్ చేశారు.

కలికిరిలో...: కలికిరి మండలంలోని మేడికుర్తి వీఆర్వో శ్రీనివాసులును సస్పెండ్ చేస్తూ కలెక్టరు ఆదేశాలు జారీ చేశారు. అదేవిధంగా తహసీల్దారు మహేశ్వరీబాయికి షోకాజ్ నోటీసు జారీ చేశారు. బాహుదా నదిలో విచ్చలవిడిగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని మేడికుర్తి గ్రామానికి చెందిన పలువురు రైతులు సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావేదికలో కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వకాలు జరుపుతున్నట్లు పేర్కొన్నారు. దీంతో సీరియస్ అయిన కలెక్టరు రైతుల ముందే వీడియో కాన్ఫరెన్సు ద్వారా తహసీల్దారును వివరణ కోరారు. అయితే తహసీల్దారు కోర్టు పనిమీద వెళ్లడంతో ఆర్‌ఐ కోసం వాకబు చేశారు. ఆర్‌ఐ పోస్టు ఖాళీగా ఉందని తెలియడంతో మేడికుర్తి వీఆర్వోను బాధ్యుడిగా చేస్తూ సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేశారు. రైతులు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో తహసీల్దారుకు షోకాజు నోటీసు జారీ చేశారు. వెంటనే దీనిపై వివరణ ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం రెవెన్యూ అధికారులు హడావిడిగా బాహుదా నది ప్రాజెక్టు ఆనకట్ట దగ్గర నుంచి ఇసుక తరలించకుండా ఎక్స్‌కవేటర్లతో కందకాలు తవ్వించారు.

పశు సంచార వైద్యశాలలకు 'రైట్ రైట్'

- నెలాఖరుకల్లా గ్రామాల్లో వైద్యసేవలు
- పాడి రైతులకు ఎంతో ఉపయోగం


మదనపల్లె పశువుల ఆస్పత్రిలో మూలనపడ్డ సంచార వైద్యసేవల వాహనం

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పశువులకు అత్యవసర వైద్య సేవలందించడానికి పశు సంచార వైద్యశాలలు ఎంతో ఉపయోగపడేవి. గత వైసీపీ ప్రభుత్వం వీటి నిర్వహణ, మందుల పంపిణీ తదితర విషయాల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో సంచార పశువైద్యశాలల సేవలు సగానికి సగం నిలిచిపోయాయి. వీటి ఆవశ్యకత గుర్తించిన ప్రస్తుత ప్రభుత్వం ఈనెలాఖరుకల్లా పశు సంచార వైద్యశాలలను పునఃప్రారంభించేందుకు చర్యలు తీసుకుంది.

1962 టోల్‌ఫ్రీ నెంబర్‌తో...

108 తరహాలోనే 1962 నెంబర్‌కు పాడి రైతులు ఫోన్ చేస్తే వారి గ్రామాలకు పశు సంచార వైద్యశాలలు వెళతాయి. అక్కడ పశువులకు ప్రాథమిక చికిత్సలు, చిన్న చిన్న శస్త్రచికిత్సలు అందించి వస్తాయి. ఒకవేళ ఆవుకు అత్యవసర చికిత్స అవసరమైతే ఈ వాహనంలో ఉండే హైడ్రాలిక్ లిఫ్ట్ ద్వారా ఆవును ఈ వాహనంలోనే ఎక్కించి, నియోజకవర్గ కేంద్రంలోని పశువుల ఆస్పత్రికి తరలించి మెరుగైన వైద్యచికిత్సలు అందిస్తారు. జిల్లాలోని ఆరు నియోజకవర్గాలకు 6 పశు సంచార వైద్యశాలలు మంజూరు కాగా మొదటి దశలో రెండేళ్ల అగ్రిమెంట్ కింద ఓ సంస్థ నిర్వహణ బాధ్యతలు తీసుకుని నిర్వహించింది. గత డిసెంబరులో ఈ అగ్రిమెంట్ పూర్తి కావడంతో డిసెంబరు నుంచి ఈ వాహనాలు నిలిచిపోయాయి. దీంతో పశువులకు వైద్యసేవలు అందకుండా పోయాయి. అంతేకాకుండా వైసీపీ పాలనలో ఈ వైద్యసేవల వాహనాల్లో అవసరమైన మందులు సరఫరా చేయలేదనే ఆరోపణలతో పాటు, విధులు నిర్వహించే సిబ్బందికి ఐదు నెలల పాటు వేతనం మంజూరు చేయలేదు. 2023 సంవత్సరం రెండో దశలో ప్రారంభించిన ఏడు పశు సంచార వైద్యశాల వాహనాలు ఇప్పటికీ తిరుగుతూనే ఉండటంతో కొద్దో గొప్పో పశువులకు వైద్యసేవలు అందుతున్నాయి.

ప్రభుత్వం చర్యలు

జిల్లాలో పశు సంచార వైద్యశాల సేవలను పునఃప్రారంభించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 340 సంచార పశువైద్యసేవల వాహనాలను నిర్వహణకు టెండర్లు పిలిచింది. ఈ టెండర్లలో హెచ్ 1గా నిలిచిన భవ్య సంస్థకు ప్రభుత్వం కాంట్రాక్టు అప్పగించింది. ఒక్కో వాహనం నిర్వహణకు నెలకు రూ.1,64,500 చొప్పున ప్రభుత్వం చెల్లించనుంది. ఈ క్రమంలో ఈ వాహనంలో వెటర్నరీ సైన్సు హౌస్‌సర్జన్ చేసిన ఓ వైద్యుడు, డిప్లొమో చేసిన కాంపౌండర్, డ్రైవర్ కమ్ అటెండర్ ఉంటారు. కాల్ సెంటర్‌కు ఫోన్ వచ్చిన వెంటనే వారి దిశానిర్దేశం మేరకు ఆయా గ్రామాలకు వెళ్లి పశువులకు వైద్యసేవలు అందిస్తారు. వైద్యుడికి రూ.30 వేల నుంచి రూ.40 వేలు, కాంపౌండర్‌కు రూ.20 వేలు, డ్రైవర్ కమ్ అటెండర్‌కు రూ.10,500 వేతనాలు చెల్లిస్తారు.

అందుబాటులో వైద్యసేవలు

పశు సంచార వైద్యశాలలో పశువులకు సంబంధించి రక్త పరీక్షలు, మూత్రం, పేడ పరీక్షలు, పాలు పరీక్షలు నిర్వహించడానికి మైక్రోస్కోప్ ఉంటుంది. నట్టల నివారణకు తినిపించే మందు, డీ-వార్మింగ్ మందులు వ్యాక్సినేషన్, ప్రథమ చికిత్స మందులు, చిన్నచిన్న శస్త్రచికిత్సల పరికరాలు అందుబాటులో వుంటాయి.

మూలన పడ్డ ఆరు వాహనాలు

జిల్లాలోని ఆరు నియోజకవర్గాలకు మొదటి దశలో మంజూరైన ఆరు పశు సంచార వైద్యసేవల వాహనాలు డిసెంబరు నాటికి కాంట్రాక్టు ముగియడంతో నిలిచిపోయాయి. అప్పటి నుంచి ఆయా పశువైద్యశాలల ఆవరణంలో మూలన నిలిపి ఉంచారు. వాహనాల నిర్వహణ లేకపోవడంతో బ్యాటరీలు డెడ్ అయ్యాయి. టైర్లతో గాలి తగ్గిపోయి, రోడ్డు మీద తిరిగే పరిస్థితి కనిపించడం లేదు. ఈ వాహనాలు రోడ్లపైకి రావాలంటే మరమ్మతులు తప్పనిసరి.

13 వాహనాలతో వైద్యసేవలందిస్తాం

జిల్లాలోని ఆరు నియోజకవర్గాల్లో పశువులకు గ్రామాలకు వెళ్లి వైద్యసేవలందించేందుకు ఈనెలాఖరుకు 13 వాహనాలు సిద్ధం చేస్తున్నాం. కాంట్రాక్టు దక్కించుకున్న సంస్థ ప్రతినిధులు ఇప్పటికే నిలిచిపోయిన ఆరు వాహనాల ఫిట్‌నెస్ పరీక్షించి, చిన్నచిన్న రిపేర్లు ఉంటే చేయిస్తున్నారు. ప్రస్తుతం తిరుగుతున్న ఏడు వాహనాలతో పాటు మిగిలిన ఆరు వాహనాలు సిద్ధం చేసి పశువులకు సంచార వైద్యశాల నుంచి వైద్యసేవలందిస్తాం.

- డాక్టర్ గుణశేఖర్ పిళ్లై,
పశుసంవర్ధకశాఖ జిల్లా అధికారి, రాయచోటి.

క్రమశిక్షణ, సేవాభావానికి ప్రతీక స్కౌట్

- డీఈవో సుబ్రమణ్యం



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఈవో సుబ్రమణ్యం

రాయచోటిటౌన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో చిన్ననాటి నుంచే క్రమశిక్షణతో పాటు దేశభక్తి, సామాజిక సేవా భావాలను పెంపొందించడానికి బాలభటుల ఉద్యమం (స్కౌట్స్ అండ్ గైడ్స్) ఎంతగానో తోడ్పడుతుందని జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రమణ్యం అన్నారు. మంగళవారం రాయచోటి పట్టణంలోని ఎస్ఎన్ కాలనీలో గల కో-ఆపరేటివ్ కాలనీ ప్రాథమిక పాఠశాలలో స్కౌట్ నూతన యూనిట్‌ను డీఈవో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయచోటిలోని ప్రాథమిక పాఠశాలలో మొట్టమొదటిసారిగా కబ్ (బాలురు), బుల్ బుల్ (బాలికలు) యూనిట్లు ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ఇందుకు చొరవ చూపిన ఫ్లాక్ లీడర్ ధనలక్ష్మికి ప్రత్యేకంగా అభినందనలు తెలియజేస్తున్నామన్నారు. ప్రతి పాఠశాలలో స్కౌట్ యూనిట్‌ను తప్పనిసరిగా ఏర్పాటు చే యాలన్నారు. స్కౌట్‌లో చేరడం ద్వారా విద్యార్థి దశ నుంచే తల్లిదండ్రులతో, గురువులతో మర్యాద పూర్వకంగా వ్యవహరిస్తూ సమాజం పట్ల బాధ్యతగా వ్యవహరించడానికి అవకాశం ఏర్పడుతుందన్నారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ ట్రైనింగ్ పొందిన విద్యార్థులకు శారీరక దారుఢ్యంతో పాటు బంగారు భవిష్యత్తు సమకూరుతుందన్నారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించడం ద్వారా ప్రపంచ స్థాయి పౌరులుగా ఎదిగేందుకు ఇది ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ అసోషియేషన్ జిల్లా కార్యదర్శి మడితాటి నరసింహారెడ్డి, పాఠశాల హెడ్ టీచర్ వీరమ్మ, యూనిట్ లీడర్ మడితాటి ధనలక్ష్మి, విద్యా కమిటీ చైర్మెన్ వహిదా, ఉపాధ్యాయులు వెంకటయ్య, రాధమ్మ, విమలకుమారి, చెంచురెడ్డి, లీలావతమ్మ, సరితమ్మ, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఈకేవైసీ చేయకపోతే రేషన్ కార్డులు గల్లంతే

- సబ్ కలెక్టరు మేఘస్వరూప్


రెవెన్యూ అధికారులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

కలికిరి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): రేషన్‌కార్డులకు ఈకేవైసీ చేసే ప్రక్రియ ఎట్టి పరిస్థితుల్లోనూ ఈనెలాఖరుకు పూర్తి చేయాలని మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ స్పష్టం చేశారు. కేవైసీ పూర్తి కాని రేషను కార్డులు నిరర్థకమవుతాయని, రేషన్ సరుకులు కూడా వారికి పంపిణీ కాబోవని ఆయన చెప్పారు.

మంగళవారం స్థానిక సైనిక పాఠశాలలో జరిగిన యూఎల్‌బీ సమావేశానికి హాజరయ్యా రు. అది పూర్తయిన అనంతరం ఎమ్మార్వో కార్యాలయంలో తహసీల్దారు, వీఆర్వోలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పేదలు ఆక్రమించుకున్న స్థలాలను క్రమబద్ధీకరించే వెసులుబాటును క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించి క్రమబద్ధీకరించుకునే విధంగా అవకాశం కల్పించాలని చెప్పారు. చెరువుల ఆ యకట్టు ద్వారా సాగయ్యే భూములకు నీటి తీరువా వసూళ్ల కోసం డిమాండ్లు తయారు చేసి సిద్ధంగా ఉంచాలని తెలిపారు. ప్రజా వేదిక ద్వారా వచ్చే అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. సమావేశంలో తహసీల్దారు మహేశ్వరీబాయి, వీఆర్వోలు పాల్గొన్నారు.

దళితులకు ఎక్కడా అన్యాయం జరగకూడదు


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): దళితులకు ఎక్కడా అన్యాయం జరగరాదని, జిల్లాలో సామాజిక రుగ్మతలను సమూలంగా తొలగించడమే లక్ష్యంగా పాదర్శకంగా, నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ అధ్యక్షతన సాంఘీక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ సంబంధించిన కేసుల్లో బాధితులకు న్యాయంతో పాటు త్వరితగతిన పరిహారం అందించేందుకు చర్యలు తీసుకోవాలని సబ్ కలెక్టర్లు ఆర్డీవోను అడిషనల్ ఎస్పీని, డీఎస్పీలను ఆదేశించారు. దళితుల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల అవకాశాలను కల్పిస్తోందని పేర్కొన్నారు.

ప్రతి మండలంలో ఆఖరి శనివారం రోజున సివిల్ రైట్స్‌డే తప్పకుండా జరిపి దానికి సంబంధించిన నివేదికను సమర్పించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, మదనపల్లి సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్, డీఆర్‌వో మధుసూదన్‌రావు, జిల్లా సాంఘీక సంక్షేమశాఖ అధికారి జయప్రకాశ్, రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్, రాజంపేట, మదనపల్లె డివిజన్ల డీఎస్పీలు, డీవీఎంసీ కమిటీ సభ్యులు, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బాలింత మృతిపై కేసు నమోదు

బి.కొత్తకోట, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఓ బాలింత మృతిపై కేసు నమోదు చేసినట్లు సీఐ జీవన్‌గంగనాథ్‌బాబు తెలిపారు. మండలంలోని కోటావూరు పంచాయతీ బూదల వారిపల్లెకు చెందిన గాయత్రి(25)తన భర్త రాజేష్‌తో కలిసి బెంగళూరులో నివాసం వుంటోంది. ఇటీవల బి.కొత్తకోట ప్రభుత్వాసుపత్రిలో కాన్పు అవడంతో పాటు ట్యూబెక్టమీ ఆపరేషన్ చేయించుకుంది. తీవ్రమైన కడుపునొప్పి రావడంతో చికిత్స చేయించుకుంది. అయినా తగ్గక పోవడంతో వైద్యులు మదనపల్లెకు రెఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో ఆమె సోమవారం మృతి చెందింది. దీనిపై విచారణ చేయాలంటూ మృతురాలి అన్న రెడ్డిప్రవీణ్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ జీవన్ గంగనాథ్‌బాబు తెలిపారు.

ద్విచక్ర వాహనం కాల్చివేత


రంగనాయకులపేటలో కాలిపోయిన స్కూటర్

రైల్వేకోడూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రంగనాయకుల పేటలో అఫ్సర్ అనే వ్యక్తికి చెందిన ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు కాల్చివేశారని మంగళవారం రైల్వేకోడూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుడు మీడియాతో మాట్లాడుతూ ఇంట్లో తాము నిద్రిస్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి తన స్కూటర్‌ను కాల్చివేసినట్లు తెలిపాడు. తనకు న్యాయం చేయాలని పోలీసులను కోరడంతో వారు విచారిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో బాలిక మృతి


యశశ్విత (ఫైల్)

రాయచోటిటౌన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణ పరిధిలోని ఏజీ గార్డెన్ సమీపంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యశశ్విత (8) అనే బాలిక మృతి చెందింది. పోలీసుల కథనం మేరకు... చిన్నమండెం మండలం చాకిబండ కురవపల్లెకు చెందిన కోటకొండ రామదాసు, సుజాత దంపతులు రాయచోటి పట్టణంలో ఇల్లు నిర్మించుకుంటున్నారు. వీరికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. యశశ్విని మూడో సంతానం. మంగళవారం రాయచోటి- చిన్నమండెం మార్గంలోని ఏజీ గార్డెన్, గొర్లముదివేడు క్రాస్‌కు మధ్యలో దుకాణాల వద్ద తండ్రీకూతురు రోడ్డు దాటు తుండగా చిన్నమండెం వైపు నుంచి రాయచోటి వస్తున్న బొలేరో వాహనం వేగంగా వచ్చి ఢీకొంది. దీంతో యశశ్విత మృతిచెందింది. ఈ మేరకు రాయచోటి ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నడి రోడ్డుపై వైసీపీ నేత జన్మదిన వేడుకలు

- ఆరుగురిపై కేసు నమోదు

పీలేరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): అధికారం కోల్పోయినా వైసీపీ నేతల ఆగడాలకు అంతు ఉండడం లేదు. అధికారంలో ఉండగా ప్రవర్తించినట్లుగానే ఇప్పుడూ బాధ్యతారాహిత్యంగా ప్రవర్తిస్తున్నారు. అందుకు పీలేరులో మంగళవారం జరిగిన సంఘటన తాజా సాక్ష్యంగా నిలుస్తోంది. పీలేరు పట్టణానికి చెందిన వైసీపీ నేత, రాజంపేట పార్లమెంటరీ యూత్ విభాగం ప్రధాన కార్యదరి కృష్ణ చైతన్య రెడ్డి మంగళవారం తన జన్మదినం జరుపుకున్నారు. అదీ మందీ మార్బలంతో పీలేరు-కడప ప్రధాన రహదారిపై కార్లు, స్కూటర్లు అడ్డుపెట్టి మరీ కేక్‌లు కట్ చేయడమే కాకుండా పెద్దఎత్తున బాణాసంచా పేల్చారు. ట్రాఫిక్‌కు అంతరాయంగానే కాకుండా అక్కడున్న వారి ప్రవర్తన ఇబ్బందికరంగా ఉండడంతో స్థానికులు పీలేరు అర్బన్ పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పీలేరు అర్బన్ సీఐ యుగంధర్ సంఘటనా స్థలానికి చేరుకుని కృష్ణచైతన్య రెడ్డితోపాటు చాంద్‌బాషా, శేఖర్‌రెడ్డి, విష్ణు ప్రభు, నవీన్ కుమార్ రెడ్డి, వినోద్‌లతోపాటు మరికొంత మందిపై కేసు నమోదు చేశారు. ఒక కారుతో సహా మోటారు సైకిల్‌ను సీజ్ చేశారు.

వీడీవో క్వార్టర్స్ అక్రమాలను తొలగించండి


ఆక్రమణలను పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో రవికుమార్‌నాయుడు

- జడ్పీ సీఈవో రవికుమార్‌నాయుడు

గుర్రంకొండ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో వీడీవో క్వార్టర్స్ అక్రమాలను తొలగించాలని మంగళవారం చిత్తూరు జిల్లా జడ్పీ సీఈవో రవికుమార్‌నాయుడు అధికారులకు సూచించారు. పట్టణంలోని కడప-బెంగుళూరు జాతీయ రహదారిపై ఉన్న వీడీవో క్వార్టర్స్ భవనం కొన్నేళ్లుగా ఖాళీగా ఉంటూ పాడుపడిందని, గత వైసీపీ ప్రభుత్వం హయాంలో కొందరు నాయకులు ఆక్రమించుకొని అందులో రేకుల షెడ్లను ఏర్పాటు చేసి వ్యాపారాలు చేస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో వీడీవో క్వార్టర్స్ స్థలం ఆక్రమణలపై గ్రామస్థులు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో జడ్పీ సీఈవో ఆక్రమణలను పరిశీలించారు. అనంతరం ఆక్రమాలను తొలగించాలని ఎంపీడీవో వెంకటేశులకు సూచించారు. ఆక్రమాలను తొలగించిన వెంటనే అందులో షాపింగ్ రూములు నిర్మించేందుకు నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో రికార్డులను పరిశీలించి ఉద్యోగుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏవో నాగశివారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం సీజ్

పెద్దమండ్యం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని కలిచెర్లలో అక్రమంగా రాయచోటికి తరలిస్తున్న 417 రేషన్ బియ్యం బస్తాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వీవీ రమణ తెలిపారు. రాయచోటిటౌన్‌కు చెందిన చాంద్‌బాష టాటా సుమోలో అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న వాహనాన్ని, బియ్యం బస్తాలను సీజ్ చేసి నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పుష్కరకాలంగా ఎదురుచూపు

- ఇళ్ల పట్టాల కోసం ఆర్టీసీ కార్మికుల నిరీక్షణ
- రూ.రెండు కోట్లు వసూలు చేసినా చేతికందని పట్టాలు
- గత ప్రభుత్వంలో ప్లాట్లు వేసి స్లిప్పులు పంచిపెట్టారు
- ఈ ప్రభుత్వంలోనైనా పట్టాలు చేతికందేనా అంటూ కార్మికుల ఎదురుచూపులు

పీలేరు రూరల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : వారంతా ఆర్టీసీ కార్మికులు రేపో మాపో ఇంటి స్థలాలకు పట్టాలు ఇచ్చేస్తారు.... సొంత ఇంటి కల నెరవేరుతుందని కోటి ఆశలతో అధికారులు చెప్పే మాయమాటలు నమ్మి పుష్కర కాలంగా ఎదురు చూస్తూనే ఉన్నారు. పన్నెండి... పట్టాలు ఇవ్వడమే తరువాయి అంటూ నాటి నుంచి నేటి వరకూ కార్మికులను వంచిస్తూనే ఉన్నారు. ఇంకెంత కాలం వేచి ఉండాలో అర్థం కాక కార్మికులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. ఒక్కో కార్మికుడి వద్ద నుంచి రూ.40 వేలు చొప్పున రెండు కోట్లు వసూలు చేసినా ఇంకా పట్టాలు చేతికందకపోవడంతో తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికే ఇంటి స్థలం కోసం డబ్బులిచ్చిన కార్మికులలో పలువురు పదవీ కూడా విరమణ చేశారు. పీలేరు ఆర్టీసీ డిపోలో సుమారు 500 మంది కార్మికులు పనిచేస్తున్నారు. వీరిలో 480 మందితో 2013 అక్టోబరు 21న ఏపీఎస్‌ఆర్టీసీ హౌసింగ్ సొసైటీ ఏర్పాటు చేశారు. సొంతంగా ఇల్లు నిర్మించుకునేందుకు స్థల సేకరణ కోసం ఒక్కో కార్మికుడి వద్ద రెండు విడతలలో రూ.40 వేలు చొప్పున వసూలు చేశారు. కార్మికుల నుంచి వసూలు చేసిన డబ్బులో రూ.1.21 కోట్లతో పీలేరు మండలం ఎర్రగుంట్లపల్లె పంచాయతీ పరిధిలోని నెట్టిబండ సమీపంలో సర్వే నెంబర్లు-774-2లో 4.72 ఎకరాలు, 657-4లో 2.60 ఎకరాలు, 655-బీ5లో 2.85 ఎకరాలు, 657-6లో 1.52 ఎకరాలు, 657-3లో 1.50 ఎకరాలు, 657-7లో 20 సెంట్లు, 776-2లో 32.38 ఎకరాలు, ఇలా పలువురి వద్ద 15.77 ఎకరాల డీకేటీ భూములు కొన్నారు. అనంతరం 13 మంది సభ్యులతో హౌసింగ్ సొసైటీ కమిటీ ఏర్పాటు చేశారు.

కేసులు...అరెస్టులు...

పలువురి రైతుల వద్ద భూములు కొన్నా వాటిని కార్మికులకు చూపకపోవడంతో కొందరు సొసైటీ సభ్యులపై తీవ్ర ఒత్తిడి తీసుకొచ్చారు. సొసైటీ జనరల్ బాడీ సమావేశాలు నిర్వహించడం లేదని, ఎటువంటి సమాచారం ఇవ్వడం లేదని ఆరోపిస్తూ కొందరు పీలేరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మరోవైపు ఆర్టీసీ నిబంధనల ప్రకారం సంస్థ పేరుతో ఎటువంటి లావాదేవీలు నిర్వహించరాదు. అయితే సంస్థ అనుమతి లేకుండానే అప్పట్లో ఇక్కడ పనిచేస్తున్న ఓ అధికారి ఇష్టానుసారంగా వ్యవహరించి సంస్థ పరువు బజారుకీడుస్తున్నారని కార్మికులు పోలీసులకిచ్చిన ఫిర్యాదులో పేర్కొనడం గమనార్హం. ఇంతటితో ఊరుకోని కార్మికులు ఎస్పీ, ఆర్టీసీ ఎండీకి ఫిర్యాదు చేయడంతో పాటు కోర్టులో కేసులు వేయడం, పలువురు సభ్యులను అరెస్ట్ చేయడం, బెయిల్‌పై బయటకు రావడం జరిగిపోయాయి. దీంతో కార్మికుల్లో సర్వత్రా ఉత్కంఠ, ఆందోళన నెలకొంది. వైసీపీ ప్రభుత్వంలో కొందరు ఆర్టీసీ కార్మిక సంఘ నాయకుల అప్పటి జిల్లా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో సంప్రదించి ఎలాగైనా ఆర్టీసీ కార్మికులకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని ఒత్తిడి తీసుకొచ్చారు. దీంతో కార్మికులు పలువురు రైతుల వద్ద కొన్న 15.77 ఎకరాలు ఉంది, అందులో అందరికీ పట్టాలు ఇద్దామని భరోసా ఇచ్చారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆర్టీసీ నగర్ పేరుతో కార్మికులు కొన్న స్థలాన్ని చదును చేయించి లేఔట్ వేశారు. ఇక్కడే కార్మికులందరికీ ఇళ్ల పట్టాలు ఇస్తామని నమ్మించి కార్మికులతో సమావేశం ఏర్పాటు చేసి పట్టాలు ఇవ్వకుండా కేవలం ప్లాట్ నెంబర్ ఉన్న స్లిప్పులు ఇచ్చి చేతులు దులుపుకున్నారు. మరోవైపు కోర్టులో పెండింగ్ కేసులు పరిష్కారం కాకపోవడంతో కార్మికుల సొంతింటి కల స్లిప్పులకే పరిమితమైంది. కోర్టులో ఉన్న కేసుల పరిష్కారం కోసం కొందరు యూనియన్ నేతలు భారీ మొత్తంలో డబ్బులు డిమాండ్ చేస్తున్నారన్న విమర్శలు లేకపోలేదు. పుష్కర కాలం గడచిపోయింది. ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దలు వాస్తవ పరిస్థితులను గుర్తించి తమకు కేటాయించిన ప్లాట్లలో ఇంటి పట్టాలు ఇప్పించి తమను ఆదుకోవాలని పలువురు కార్మికులు కోరుతున్నారు.


పీలేరు మండలం నెట్టిబండ వద్ద ఇళ్ల స్థలాల కోసం ఆర్టీసీ కార్మికులు రైతుల వద్ద కొన్న భూమి


వైసీపీ హయాంలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆర్టీసీ నగర్ పేరున వేసిన శిలాఫలకం

కార్మికులకు న్యాయం చేస్తాం...



కార్మికులు ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న ఇళ్ల పట్టాలు ఇప్పించి వారికి న్యాయం చేస్తాం. ఇందు కోసం పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డితో సంప్రదిస్తాం. వీలైనంత త్వరగా కార్మికుల చిరకాల వాంఛ నెరవేర్చడం కోసం ఉన్న అడ్డంకులను సామరస్యంగా పరిష్కరిస్తాం. ఇళ్ల పట్టాల కోసం ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదు. కార్మికులకు అండగా ఉంటాం.

-శ్రీనాథరెడ్డి,
ఈయూ పీలేరు డిపో గౌరవాధ్యక్షుడు, పీలేరు.

అందరికీ పట్టాలు ఇప్పించడమే లక్ష్యం...



చాలీచాలని జీతాలతో ఇబ్బందులు పడుతున్న ఆర్టీసీ కార్మికులందరికీ పట్టాలు ఇప్పించడమే లక్ష్యం. ఇప్పటికే ఈ దిశగా ముందుకుపోతున్నాం. ఇందుకు అవసరమైన సమస్యల పరిష్కారం కోసం కార్మికులంతా సమిష్టిగా ముందుకు పోతాం. కార్మికులెవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదు. కాస్త ఆలస్యమైనా అందరికీ న్యాయం చేస్తాం.

-పీఎస్ఎం రాజు,
ఎన్ఎంయూ జిల్లా ప్రధాన కార్యదర్శి, పీలేరు.

అధైర్య పడాల్సిన అవసరం లేదు....



పీలేరు డిపోలో పనిచేస్తున్న ఆర్టీసీ కార్మికులు అధైర్యపడాల్సిన అవసరం లేదు. అందరికీ న్యాయం చేస్తాం. సమస్యను ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాం. ఇప్పటికే ఆలస్యమైంది. గత పాలకులు సక్రమంగా పట్టించుకోకపోవడం వల్లే ఇబ్బందులు. అందరికీ ఇళ్ల పట్టాలు ఇప్పించడం తక్షణ కర్తవ్యం.

- వై.రెడ్డెప్పరెడ్డి,
ఎన్ఎంయూ పీలేరు డిపో గౌరవాధ్యక్షుడు

హైస్కూల్ ప్లస్‌కు స్వస్తి

- జూనియర్ కళాశాలలుగా మార్చాలనే యోచన
- మండలానికి ఒక కళాశాల ఉండేలా చర్యలు
- వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఏర్పాటు
- యథాతథంగా కొనసాగించాలని ఉపాధ్యాయుల డిమాండ్



కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉన్న హైస్కూ ల్ ప్లస్‌లు వచ్చే విద్యా సంవత్సరం నుంచి కొనసాగుతాయా లేదా అనే సందిగ్ధత నెలకొంది. వీటి కొనసాగింపుపై ఇప్పటికే ఉన్నతాధికారులు పరోక్షంగా పలుమార్లు ఉపాధ్యాయ సంఘాలతో జరిగిన చర్చలలో స్పష్టత ఇచ్చారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి హైస్కూల్ ప్లస్‌లను తొలగించి వాటి స్థానంలో జూనియర్ కళాశా లలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కానీ ఉపాధ్యాయులు మాత్రం వాటిని యదాతథంగా కొనసాగించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు పలు ఉపాధ్యాయ సంఘాల నేతలు వినతిపత్రాలను కూడా అందజేశారు.

ఉమ్మడి కడప జిల్లాలో 28 హైస్కూల్ ప్లస్‌లు ఉన్నాయి. వీటిని తొలగిస్తామని అధికారులు మౌఖిక ఆదేశాలు జారీ చేయ డంతో అందులో పనిచేసే సిబ్బంది డైలమాలో పడ్డారు. గత ప్రభు త్వం 2022లో 10 హైస్కూల్ ప్లస్‌లను (మహిళా జూనియర్ కళా శాలలు) ఏర్పాటు చేసి కేవలం బాలికలకు అవకాశం కల్పించారు. వీటికి అదనంగా 2024-25 విద్యా సంవత్సరం నుంచి మరో 18 హైస్కూల్ ప్లస్‌లను ఏర్పాటు చేస్తూ ఎన్నికల ముందు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఉమ్మడి కడప జిల్లాలో 28 హైస్కూల్ ప్లస్‌లు ఉండగా.. వాటిలో 14 మాత్రమే కొనసాగుతున్నాయి.

మండలాల్లో జిల్లా పరిషత్ పాఠశాలలను మెర్జ్ చేసి హైస్కూల్ ప్లస్ పేరిట ఇంటర్మీడియట్‌ను పరిమితమైన గ్రూపులతో సిబ్బంది కొరతతో జడ్పీ హైస్కూల్లోనే నిర్వహిస్తున్నారు. గతంలో ఏర్పాటు చేసిన పది హైస్కూల్ ప్లస్‌లలో పూర్తి స్థాయిలో సిబ్బంది, గ్రూపులను ఏర్పాటు చేయకుండానే మళ్లీ 18 ఏర్పాటు చేయడంతో విమర్శలు వెల్లువెత్తాయి. ఎన్నికల ముందు 18 కోఎడ్యుకేషన్ హైస్కూల్ ప్లస్‌లను ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన గత ప్రభుత్వం అందులో సిబ్బందిని మాత్రం నియమించలేదు. దీనిపై ఉపాధ్యాయులు అనేకమార్లు అధికారులకు విజ్ఞప్తి చేసిన ఫలితం లేకపోయింది. హైస్కూల్ ప్లస్‌ల నిర్వహణలో తీసుకున్న అనాలోచిత నిర్ణయాలతో విమర్శలు వెల్లువెత్తాయి. గత రెండేళ్లుగా ఇంటర్ ఫస్ట్ యర్, సెకండియర్ ఫలితాల్లో విద్యార్థులు దారుణంగా ఫెయిల్ అయ్యారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం పాఠశాలలతో పాటు హైస్కూల్ ప్లస్‌లను ప్రక్షాళన చేయాలని నిర్ణయించింది.

హైస్కూల్ ప్లస్ సిబ్బందిలో గుబులు

వచ్చే విద్యా సంవత్సరం నుంచి హైస్కూల్ ప్లస్‌లను తొలగిస్తారంటూ ప్రచారం జరుగుతుండడంతో వాటిలో పనిచేసే సిబ్బందిలో గుబులు పుడుతోంది. వాస్తవానికి గత ప్రభుత్వం మొదట 10 హైస్కూల్ ప్లస్‌లు ఏర్పాటు చేసినప్పుడు వారికి పాఠాలను బోధించడానికి పాఠశాల విద్యలోని ఆయా యాజమాన్యాలలో పనిచేసే అర్హులైన స్కూల్ అసిస్టెంట్లను పీజీటీలుగా పదోన్నతులు ఇచ్చి నియ మించారు. అయితే ఇపుడు ఈ హైస్కూల్ ప్లస్‌లు జూనియర్ కళాశాలలుగా రూపాంతరం చెందిన తర్వాత అక్కడ పనిచేసే ఉపాధ్యాయులను తిరిగి వెనక్కి అంటే పూర్వం పనిచేసే పాఠశా లలకు స్కూల్ అసిస్టెంట్లుగా పంపుతామని అధికారులు ఉపాధ్యా య సంఘాల నేతలకు చెబుతున్నారు. దీంతో హైస్కూల్ ప్లస్ సిబ్బంది అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. హైస్కూల్ ప్లస్‌లను జూని యర్ కళాశాలలుగా ఏర్పాటు చేసినా.. తదుపరి జిల్లా పరిషత్ పాఠశాలల్లో పనిచేసే అర్హత కలిగిన స్కూల్ అసిస్టెంట్లు, హెచ్‌ఎంలకు పీజీటీలుగా పదోన్నతులు ఇవ్వాలని కోరుతున్నారు.

తలనొప్పిగా మారిన జీఓ 302, 223

ప్రస్తుతం ఉన్న హైస్కూల్ ప్లస్‌లను జూనియర్ కళాశాలలుగా మారిస్తే నిబంధనల ప్రకారం జీఓ 302, 223లను అనుసరించి సిబ్బంది నయామక ప్రక్రియను చేపట్టాల్సి ఉంది. ఈ నిబంధనల ప్రకారం పాఠశాల విద్యలో పనిచేసే ఉపాధ్యాయులను నియమించే అవకాశం లేకపోవడంతో ఉపాధ్యాయులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో లెక్చరర్ల నియామకానికి 1979 నుంచి ప్రభుత్వాలు తీసుకువచ్చిన జీఓలు ఇలా ఉన్నాయి. జీఓ 939 ప్రకారం జిల్లా పరిషత్, మున్సిపల్ టీచర్లకు 25శాతం, ప్రభుత్వ టీచర్లకు 25శాతం పదోన్నతుల కోటాలో భర్తీ చేయాలి. మిగిలిన 50శాతం మందిని డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా తీసుకోవాలి. 1993లో తీసుకువచ్చిన 302 జీవో ప్రకారం 50శాతం డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా, 40శాతం జిల్లా పరిషత్, ప్రభుత్వ టీచర్లను పదోన్నతుల ద్వారా భర్తీ చేయాల్సి ఉంది. మిగిలిన 10శాతం నాన్ టీచింగ్ స్టాఫ్ ద్వారా భర్తీ చేయాలి. ఇందులో గతంలో ఉన్న మున్సిపల్ టీచర్స్ 25శాతం కోటాను తొలగించారు. ఆ తదుపరి 2008లో తీసుకువచ్చిన 223 జీవో ప్రకారం 90శాతం డైరెక్ట్ రిక్రూట్‌మెంట్, 10 శాతం నాన్ టీచింగ్ స్టాఫ్‌కు పదోన్నతుల ద్వారా భర్తీ చేయాల్సి ఉంది. ఇందులో అప్పటి వరకు జిల్లా పరిషత్, ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఉన్న 40శాతం కోటాను తొలగించారు. ఇలా జీఓ 302లో మున్సిపల్ టీచర్ల కోటాను, జీఓ 223లో జిల్లా పరిషత్, ప్రభుత్వ టీచర్ల కోటాను తొలగించారు. ఇపుడు జీఓ 223ను తొలగించాలని జిల్లా పరిషత్ ఉపాధ్యాయులు డిమాండ్ చేస్తుండ డంతో పాటు మున్సిపల్ ఉపాధ్యాయులు కూడా 1979లో తీసుకు వచ్చిన 939 జీఓను తిరిగి అమలులోకి తీసుకు రావాలని డిమాండ్ చేస్తున్నారు.

పశు పోషణతో రైతులకు ఆర్థిక బలం : కలెక్టర్

కడప కలెక్టరేట్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ స్థాయిలో పశు పోషణ ద్వారా రైతులను ఆర్థికంగా బలలోపేతం చేయడమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యమని జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్‌ఎస్ హాలులో జేడీ శారదమ్మ అధ్యక్షతన పశుసంవర్ధక శాఖ జిల్లా సమీక్షా సమావేశం జరిగింది. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాడి, పశు సంవర్ధకశాఖల ఆవశ్యకతను దృష్టిలో పెట్టుకొని ఎన్‌ఎల్‌ఎం పథకాన్ని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకొని రైతులు ఆర్థికంగా ఎదగాలన్నారు. జిల్లా ఆర్థిక ప్రగతిలో వ్యవసాయ, ఉద్యాన పంటలతో పాటు పశు సంవర్ధక శాఖ కీలకమన్నారు. జిల్లాలో పశు పోషణ, జంతు సంరక్షణ చాలా చక్కగా జరుగుతోందన్నారు. ఈవిషయంలో ప్రత్యేక శ్రద్ధవహిస్తున్న పశు సంవర్ధక శాఖ అధికారులను కలెక్టర్ అభినందించారు. జిల్లాలో కోడిగుడ్ల ఉత్పత్తి చాలా తక్కువగా ఉందని, జిల్లాలో మాంసం ఉత్పత్తులను కూడా అధికంగా పెంచాలన్నారు. లైవ్ స్టాక్ మిషన్ ద్వారా రైతులు జిల్లాలో మేలు రకమైన జంతు జాతులను ఉత్పత్తి చేయాలన్నారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా మినీ గోకులాలు, పౌల్ట్రీ, పాల ఉత్పత్తి కేంద్రాల ఏర్పాటు కోసం అవసరం అయిన అనుకూలతలను నివేదించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు ఆనంద్ నాయక్, ఆదిశేషారెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి రాజ్యలక్ష్మి, పశుసంవర్ధక శాఖ డీడీలు, ఏడీలు తదితరులు పాల్గొన్నారు.

వాటర్ గ్రిడ్ పనులను త్వరగా పూర్తిచేయాలి



వాటర్ గ్రిడ్ పనులను పరిశీలిస్తున్న విజయ్ దత్వాలియా

లింగాల, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): పులివెందుల నియోజకవర్గం ప్రజలకు తాగునీరు అందించేందుకు నూతనంగా నిర్మిస్తున్న వాటర్ గ్రిడ్ పనులను త్వరగా పూర్తి చేయాలని హిమాచల్‌ప్రదేశ్ ఆర్‌డబ్ల్యూఎస్ విశ్రాంత చీఫ్ ఇంజనీర్ విజయ్ దత్వాలియా అన్నారు. లింగాల మండల పార్నపల్లె సమీపంలో నిర్మిస్తున్న వాటర్ గ్రిడ్ పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. అనంతరం అక్కులగారి పల్లెలో పర్యటించి ప్రజలకు సరఫరా చేస్తున్న నీటికి నీటిశుద్ధి పరీక్షలు నిర్వహించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ ఏడుకొండలు, ఈఈ విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు నాణ్యమైన విద్యనందించడమే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్సీ



జడ్పీ బాలికల హైస్కూల్ ప్లస్‌లో ప్రతిభ చూపిన విద్యార్థినులకు నగదు బహుమతి అందిస్తున్న ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి

వేంపల్లె, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): పేదలకు నాణ్యమైన విద్యనందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి అన్నారు. వేంపల్లె జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్ ప్లస్‌లో ఇంటర్ బైపీసీలో మండల టాపర్‌గా నిలిచి 695 మార్కులు సాధించిన హేమలతకు, సీఈసీలో 625 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచిన ఏంజల్ ప్రణీతకు రూ.5వేలు చొప్పున నగదు బహుమతులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కళాశాలలకు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఉపాధ్యాయులు వీలైనంత ఎక్కువ మందిని ప్రభుత్వ కళాశాలల్లో చేర్పించేలా కృషి చేయాలన్నారు. అనంతరం ఆయన ఇటీవల ఉపాధ్యాయుల మధ్య జరిగిన ఘర్షణ, కేసుల గురించి వేర్వేరుగా సమావేశం నిర్వహించి ఆరా తీశారు. పిల్లలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా బాధ్యతగా పని చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాసులు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు జీవీ రమణ, ఆర్‌వీ రమేష్, భాస్కర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, మైసూరారెడ్డి, పోతిరెడ్డి శివ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఇంటర్ ఫలితాల్లో ఆర్టీపీపీ విద్యార్థిని ప్రతిభ



ఎర్రగుంట్ల, ఏప్రి ల్ 22 (ఆంధ్ర జ్యోతి): తెలంగాణ ఇంటర్ ఫలితాల్లో ఆర్టీపీపీకి చెందిన పార్లపల్లె పూజిత 991/1000 మార్కులు సాధించింది. ఈ విద్యార్థిని 10వ తరగతి వరకు ఆర్టీపీపీలోని డీఏవీలో చదివింది. పూజిత తండ్రి రామాంజనేయులు ఆర్టీపీపీలో స్టేజ్-4లో డీఈగా పనిచేస్తున్నారు. పూజిత మంచి మార్కులు సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విశ్రాంత ఎంఈఓపై కేసు

వేంపల్లె, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె విశ్రాంత ఎంఈఓ బండి వీరారెడ్డి, ఆయన కుమారుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రంగారావు తెలిపారు. జడ్పీ బాలుర హైస్కూల్‌కు చెందిన ఉపాధ్యాయుడు జనార్దన్‌రెడ్డి విధులకు ఆటంకం కలిగించారనే ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బాలిక అదృశ్యం

పులివెందుల, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని చిన్నకొండారెడ్డి కాలనీకి చెందిన స్పందన అనే బాలిక అదృశ్యమైనట్లు అర్బన్ సీఐ చాంద్‌బాష తెలిపారు. ఇటీవల ఇంటర్ పూర్తి చేసిన స్పందన సోమవారం అర్ధరాత్రి నుంచి కనిపించడం లేదని బాలిక తండ్రి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని తెలిపారు.

ప్రతీకారంతోనే హత్య

- నలుగురు అరెస్టు
- వివరాలు వెల్లడించిన ఎస్పీ అశోక్‌కుమార్



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్

కడప క్రైం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): కడప బిల్టప్ సర్కిల్‌లోని వైన్ షాపు వద్ద ఈ నెల 15న సాదక్‌వల్లి అనే పండ్ల వ్యాపారిని ప్రతీకారంతోనే దారుణంగా హత్య చేశారు. ఈ కేసులోని నలుగురు నిందితులను తాలుకా పోలీసులు అరెస్టు చేశారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని పెన్నార్ కాన్ఫరెన్స్ హాలులో ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు.

కడప పట్టణంలోని రవీంద్రనగర్‌లో కాటికాపరి వీధికి చెందిన షేక్ సాదక్‌వల్లి పాత బస్టాండులో పండ్ల వ్యాపారం చేసుకుంటూ జీవిస్తుండేవాడు. 2024 సంవత్సరంలో చింపిరి వెంకటేశ్‌ను మద్యం బాటిల్‌తో పొడిచి హత్య చేశాడు. ఈ కేసులో సాదక్‌వల్లి జైలుకు వెళ్లి బెయిలుపై బయటికి వచ్చాడు. అయితే చింపిరి వెంకటేశ్‌ను హత్య చేసినందుకు ప్రతీకారంగా అతని బంధువు రవీంద్రనగర్‌లోని మరాఠివీధికి చెందిన చప్పిడి రాయప్ప అలియాస్ పెద్దోడు ఈనెల 15న రాత్రి 8గంటలకు సాదక్‌వల్లి బిల్టప్ సర్కిల్‌లోని వైన్ షాపు వద్ద నిలబడి ఉండగా పథకం ప్రకారం తన అనుచరులుతో కలిసి కత్తులతో పొడిచి హత్య చేశారు. ఈ కేసులోని నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు.

22న మంగళవారం మధ్యాహ్నం నిందితులు రామరాజుపల్లెలోని వైజంక్షన్ వద్ద ఉన్నట్లు సమాచారం రావడంతో డీఎస్పీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సీఐ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐలు తులసి నాగప్రసాద్, తాహిర్‌హుసేన్ సిబ్బందితో కలిసి నలుగురిని అరెస్టు చేసి.. వారి వద్ద నుంచి రెండు కత్తులు, మూడు సెల్‌ఫోన్లతో పాటు స్కూటీని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో కృషి చేసిన సీఐ, ఎస్‌ఐలతో పాటు పోలీసు సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

అరెస్టు అయిన వారి వివరాలు....

సాదక్‌వలి హత్య కేసులో అరెస్టు అయిన వారిలో చప్పిడి రాయప్ప అలియాస్ పెద్దోడు బేల్దారి, కడప మోచంపేటకు చెందిన షేక్ గౌస్‌బాషా అలియాస్ కాలియా బేల్దారి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. మరియాపురానికి చెందిన శీలం బాల స్వామి కారు డ్రైవరుగా, మరాఠవీధికి చెందిన సుంకర వెంకటేశ్ హమాలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరిలో రాయప్ప, గౌస్‌బాషా, బాలస్వామిలపై రౌడీషీట్లు ఉన్నాయి. ఇలాంటి వారిపై ప్రత్యేక నిఘా ఉంచుతామని ఎస్పీ స్పష్టం చేశారు.

మహిళ మెడలోని బంగారు గొలుసు అపహరణ

కమలాపురం రూరల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మహిళ మెడలోని బంగారు గొలుసు (సరుడు)ను పట్టపగలే దొంగలు అపహరించుకు వెళ్లిన ఘటన కోగటం గ్రామంలో జరిగింది. గ్రామస్థుల వివరాల మేరకు... మంగళవారం మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో కోగటం గ్రామ సమీపంలోని తమ పొలంలో బండి వెంకటలక్షుమ్మ అనే మహిళ ఒంటరిగా పశువుల మేత కోసం గడ్డిని కోసేందుకు వెళ్లింది. గడ్డి కోస్తుండగా అక్కడ ఎవరూ లేరని గుర్తించిన దుండగుడు ఆమె వద్దకు వచ్చి ఉన్నట్లుండి మెడలోని 2లక్షల విలువైన బంగారు సరుడును లాక్కుని పరారయ్యాడు. ఈ విషయాన్ని బాధితురాలు కుటుంబ సభ్యులకు తెలపడంతో వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్‌ఐ విద్యాసాగర్ తమ సిబ్బందితో హుటాహుటిన చోరీకి గురైన స్థలానికి చేరుకుని పరిశీలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మహిళలు ఒంటరిగా పొలాలు, ఊర్లకు వెళ్లేటప్పుడు బంగారు ఆభరణాలు ధరించి వెళ్లకూడదని సూచించారు.

ప్రేమ విఫలమై యువకుడి ఆత్మహత్య



వెంకట నరసింహులు మృతదేహం

ప్రొద్దుటూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ప్రేమ విఫలమై సానా వెంకట నరసింహులు అనే యువకుడు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన ప్రొద్దుటూరు పట్టణంలో చోటు చేసుకుంది. వన్‌టౌన్ పోలీసుల వివరాల మేరకు.. ఈశ్వర్‌రెడ్డినగర్‌కు చెందిన సానా వెంటరమణ రెండో కుమారుడు వెంకట నరసింహులు (24) చిన్న చిన్న కాంట్రాక్టు పనులు చేసు కుంటూ వుండేవాడు. ఎవరో అమ్మాయిని ప్రేమించాడు. ప్రేమ విఫలమై చాలా రోజుల నుంచి తనలో తానే బాధపడుతూ వుండేవాడు. ఈ నేపథ్యంలో ఈనెల 21 తేదీ రాత్రి 7 గంటలకు ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించి ఆసుపత్రికి తరలించగా డాక్టర్ పరీక్షించి అప్పటికే చనిపోయినట్టు నిర్ధారించారు. సోదరుడు సురేష్ ఫిర్యాదు మేకు వన్‌టౌన్ ఎస్‌ఐ సంజీవరెడ్డి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బెల్టుషాపులు నిర్వహిస్తే కేసులు తప్పవు

- ఎక్సైజ్ డిప్యూటీ కమిషనరు



సమావేశంలో మాట్లాడుతున్న ఎక్సైజ్ డిప్యూటీ కమిషనరు జయరాజ్

కడప క్రైం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎక్కడైనా బెల్టు షాపులు నిర్వహిస్తే కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని... మద్యం దుకాణదారులు నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే చర్యలు తీసుకోవాలని ప్రొవిజన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనరు జయరాజ్ సిబ్బందిని ఆదేశించారు. తన కార్యాలయంలో మంగళవారం ఎక్సైజ్ అధికా రులతో సమీక్ష నిర్వహించారు. మద్యం దుకాణాలను తనిఖీ చేసి స్టాకు వివరాలను పరిశీలించాలని... ఎవరైనా ఎమ్మార్పీ ధరల కంటే ఎక్కువకు అమ్మితే వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నాటుసారా నిర్మూలనపై నవోదయ కార్యక్రమాలు నిర్వహించి.. జిల్లాను సారారహిత జిల్లాగా తయారు చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని సూచించారు. ఎక్సైజ్ కేసులు ఏవైనా పెండింగులో ఉంటే త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం ఆయన పలు రికార్డులను పరిశీలించారు. ఎక్సైజ్ అధికారులు చంద్రశేఖర్‌రెడ్డి, రవికుమార్, సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

అంతరాయం లేకుండా విద్యుత్ అందించాలి : ఎస్‌ఈ



విద్యుత్ అధికారులు సిబ్బంతో సమీక్షిస్తున్న ఎస్‌ఈ రమణ

ప్రొద్దుటూరు , ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఒక్క క్షణం కరెంటు పోయినా ప్రజలు భరించే స్థితిలో లేరని.. అంతరాయం లేని నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని ఏపీఎస్పీడీసీఎల్ సూపరిండెంట్ ఇంజనీర్ రమణ ఆదేశించారు. మంగళవారం ప్రొద్దుటూరు సబ్‌డివిజన్ పరిధిలోని రామేశ్వరం సబ్‌స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. భద్రతా నియమాలు ఎలా పాటిస్తున్నారో పరిశీలించారు. మధ్యాహ్నం డివిజన్ కార్యాలయంలో విద్యుత్ అధికారులతో సమీక్షా సమా వేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్‌ఈ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ నాటికి వ్యవసాయ సర్వీ సులు విడుదల చేయాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు, వైర్లు అందుబాటులో వున్నాయా లేదా విచారించారు. ఏప్రిల్, మే నెలలో అధికారులు సిబ్బందికి పని రెట్టింపు ఉంటుందన్నారు. ప్రకృతి వైపరీత్యాలు, ఈదురు గాలులు, ఉరుములు మెరుపులతో కూడిన వర్షంతో విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలన్నారు. వాలిపోయిన స్తంభాలు, లూజులైన్లు ఎప్పటికప్పుడు సరిచేయాలన్నారు. తక్కువ ఎత్తులో ఉన్న లైన్లను గుర్తించి వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ బిల్లులు సకాలంలో వసూళ్లకు చర్యలు తీసుకుంటూ మొండి బకాయిలపై కఠినంగా వ్యవహరించాలన్నారు. సమావేశంలో డీఈ రమణారెడ్డి, ఏడీఈలు, ఏఈలు ఈఆర్‌వో సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యత లేని అరటి మొక్కలు... నష్టపోతున్న రైతన్నలు

సింహాద్రిపురం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మండలంలో అరటి సాగు చేస్తున్న రైతులకు నర్సరీల నుంచి నాణ్యత లేని అరటి మొక్కలను సరఫరా చేయడంతో పంట దిగుబడి రాక రైతులు తీవ్ర నష్టాల పాలయ్యారు. వివరాల్లోకెళితే... ముసల్‌రెడ్డిపల్లెకు చెందిన సింగం వాసుదేవరెడ్డి తనకున్న నంద్యాలంపల్లి పొలంలో మూడున్నర ఎకరాల్లో సమారు 5వేల అరటి మొక్కలు సాగు చేశాడు. రైతు ఓ సంస్థకు చెందిన జి9 రకం మొక్కలు కావాలని ఆర్డర్ చేశాడు. కానీ ఆ డీలర్ ఆ మొక్కలు అని చెప్పి.. వాటికి బదులుగా రైతుకు తెలియకుండా మరో రకం మొక్కలను అందజేశారు. పంట సాగు మొదలైన 6 నెలల నుంచి అరటి చెట్లు విరిగి కింద పడటం, 7 నెలలకు పూత దశకు రావాల్సిన చెట్లు 10వ నెల వరకు పూతకు రాకపోవడం జరిగింది. ఏడాది గడచినా గెలలు కోతకు రాకపోవడంతో రైతు డీలర్‌ను సంప్రదిస్తే అతని నుంచి సరైన సమాధానం రాలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. చేసేది లేక పులివెందుల అరటి పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలను సంప్రదించాడు. దీంతో శాస్త్రవేత్త డాక్టర్ రేష్మా మంగళవారం అరటి తోటను పరిశీలించారు. వేరు వ్యవస్థకు సంబంధించిన శాంపుల్స్ తీసుకుని ల్యాబ్‌కు పంపి పరీక్షలు నిర్వహించి తగిన నివేదికలు అందజేస్తామని శాస్త్రవేత్త తెలిపారు. నివేదికలు రాగానే ఆ కంపెనీపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. హెచ్‌ఓ మల్లేశ్వర్‌రెడ్డి, వీహెచ్‌ఏ ప్రత్యూష, రైతులు పాల్గొన్నారు.

పంట సాగుకు రూ.8లక్షలు ఖర్చు చేశా...



అధిక దిగుబడి సాధించాలని రూ.8లక్షలు వెచ్చించి పంట సాగు చేశాను. ఒక్క రూపాయ కూడా రాలేదు. ఇలాంటి నకిలీ నర్సరీలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. పంట నష్ట పరిహారం అందించి ఆదుకోవాలి.

\- వాసుదేవరెడ్డి, రైతు, ముసల్‌రెడ్డిపల్లి



అరటి తోటలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త రేష్మా, హెచ్‌ఓ మల్లేశ్వర్‌రెడ్డి



గెల వేయకనే నేలకొరిగిన అరటి చెట్టు

ప్రభుత్వ బడుల్లో మెరుగైన విద్య

● మండల విద్యాశాఖ అధికారి రవీంద్రనాయక్

సుండుపల్లె, ఏప్రిల్22(ఆంధ్రజ్యోతి): విద్యార్థినీ, విద్యార్థులను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని మండలవిద్యాశాఖ అధికారి రవీంద్రనాయక్ తెలిపారు. మంగళవారం మండలంలోని గుండ్లపల్లి, జేపీ కురవపల్లి గ్రామాల్లో ఉపాధ్యాయులతో కలిసి ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ బడిలో విద్యార్థుల సంఖ్యను పెంచడానికి ఈ ప్రచారం నిర్వహించినట్లు తెలిపారు. ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు, తల్లిదండ్రులకు వివరించామన్నారు. తల్లికి వందనంతో పాటు ఉచితంగా మధ్యాహ్న భోజనం, పాఠ్యపుస్తకాలు, బట్టలు, స్కూల్ బ్యాగులు అందజేస్తూ విద్యావంతులైన ప్రభుత్వ ఉపాధ్యాయులతో విద్యను అందిస్తున్నామని తెలియపరిచారు. ప్రైవేటు పాఠశాలల కంటే మిన్నగా అన్ని వసతులు కల్పిస్తున్నామని, మన ఊరిలో మన ఇంటి పక్కన ఉండే బడిలో విద్యార్థులను చేర్పిస్తే సురక్షితంగా సాయంత్రానికి ఇంటికి వస్తారనే విషయాన్ని తల్లిదండ్రులు గుర్తించుకోవాలన్నారు. వేలాది రూపాయలు చెల్లించి ప్రైవేటు బడులకు పంపించకుండా ప్రభుత్వ బడికి చిన్నారులను పంపించాలని కోరారు. ఉపాధ్యాయులు బీమ్లానాయక్, గిరిప్రసాద్, నాగమునినాయక్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంఈవో రవీంద్రనాయక్

మందుబాబులా.. మజాకా..!

● పాతరాయచోటి ప్రాథమిక పాఠశాలలో అసాంఘిక కార్యక్రమాలు ● పాఠశాల తలుపులు పగలగొట్టి చోరీకి విఫలయత్నం

రాయచోటిటౌన్, ఏప్రిల్22(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలోని పాతరాయచోటిలో గల తెలుగు ప్రాథమిక పాఠశాల ఆవరణం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. గత నెల రోజులుగా మార్నింగ్ స్కూల్ కొనసాగుతుండడంతో సాయంత్రం, రాత్రి సమయాల్లో మందుబాబుల ఆగడాలు మితిమీరుతున్నాయి. దీంతో ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులు అసౌకర్యాన్ని ఎదుర్కొంటున్నారు. పలుమార్లు విద్యాశాఖ అధికారులకు తెలియజేసినా ఫలితం లేదంటున్నారు. ఈ క్రమంలోనే సోమవారం రాత్రి మద్యం సేవించేందుకు పాఠశాలలోకి వెళ్లిన మద్యం బాబులు పాఠశాల తలుపులు పగలగొట్టి చోరీకి విఫలయత్నం చేసినట్లు ఉపాధ్యాయులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. విద్యాశాఖ అధికారులతో పాటు పోలీసులు రాత్రి సమయాల్లో గస్తీ ఏర్పాటు చేసి ఆకతాయిల భరతం పట్టాలని పాతరాయచోటివాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.


పాఠశాల ఆవరణంలో మద్యం, వాటర్ బాటిళ్లు

రాత్రి సమయాల్లో పోలీసులు గస్తీ ఏర్పాటు చేయాలి

పాతరాయచోటిలో గల ప్రభుత్వ పాఠశాలకు రక్షణ లేదు. ప్రతిరోజు ఆకతాయిలు, మద్యం బాబులు పాఠశాల ఆవరణంలో మద్యం సేవించి మద్యం బాటిళ్లను అక్కడ వేసి పాఠశాల ఆవరణాన్ని అపరిశుభ్రంగా మారుస్తున్నారు. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులకు తీవ్ర అసౌకర్యం ఏర్పడుతోంది. స్థానికులు పలుమార్లు విద్యాశాఖ అధికారులు చెప్పినా వారు పట్టించుకోలేదు. రాత్రి సమయాల్లో పోలీసులు గస్తీ ఏర్పాటు చేయాలి.

- చెక్కా రమేశ్, స్థానికుడు, పాతరాయచోటి

ఒంటిమిట్ట ఎస్ఐ బదిలీ

ఒంటిమిట్ట, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : ఒంటిమిట్ట ఎస్ఐ శివప్రసాద్ బదిలీ అయ్యారు. ఈయనను బి.మఠంకు బదిలీ చేశారు. ఒంటిమిట్టకు ఎవరిని నియమించలేదు. ఒంటిమిట్ట కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరిగేందుకు ఆయన ఎంతో కృషి చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో బ్రహ్మోత్సవాలు ముగిశాయి.

ఆన్‌లైన్‌లో వేధింపులపై కేసు నమోదు

సుండుపల్లె, ఏప్రిల్22(ఆంధ్రజ్యోతి):ఇన్‌స్టాగ్రామ్‌లో వేధింపులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు మంగళవారం తెలిపారు. సుండుపల్లె మండలానికి చెందిన శ్వేత అనే మహిళకు గత కొన్ని రోజుల నుంచి ఇంస్ట్రాగ్రామ్‌లో వేధిస్తున్నారని మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఈ సందర్భంగా ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

పన్నుల వసూళ్లలో నిర్లక్ష్యం తగదు : ఈవోపీఆర్డీ

చిట్వేలి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో పన్నుల వసూళ్లలో నిర్లక్ష్యం తగదని ఈవోపీఆర్డీ రామ్మోహన్ అన్నారు. ఈ మేరకు సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతి కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవోపీఆర్డీ మాట్లాడుతూ ఇంటి పన్నులు గ్రామ అభివృద్ధికి వెన్నుముక వంటివి అన్నారు. ప్రజల సహకారంతో పంచాయతిని అభివృద్ధి పరుచుకోవాలన్నారు. ప్రతి ఇంటి వద్దకు వెళ్లి అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. ఇంటి పన్నుల వసూళ్లలో ఎదురవుతున్న సవాళ్లు, పరిష్కార మార్గాలపై విస్తృతంగా చర్చ జరిగింది. త్వరితగతిన వసూలు పూర్తి చేసేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు. పన్నుల వసూలు ప్రజలకు అవగాహన కల్పిస్తూ పంచాయతి అభివృద్ధికి ప్రజలు సహకరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. మండల అన్ని పంచాయతీల సెక్రటరీలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఈవోపీఆర్డీ రామ్మోహన్‌రెడ్డి

ఏఐటీయూసీ శిక్షణా తరగతులను జయప్రదం చేయండి

రాయచోటిటౌన్, ఏప్రిల్22(ఆంధ్రజ్యోతి): మదనపల్లిలో మే 10, 11వ తేదీల్లో రెండు రోజుల పాటు జరగనున్న ఏఐటీయూసీ జిల్లా స్థాయి శిక్షణా తరగతులను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సురేశ్‌కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం వారు స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద శిక్షణా తరగతుల కరపత్రాలు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు నేలపాటి శ్రీనివాసులు, ఏఐటీయూసీ రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి బత్తల వెంకట్రమణ, కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

'క్షయవ్యాధిని ఆరు నెలల్లో నయం చేయవచ్చు'

రైల్వేకోడూరు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ఆరోగ్య సలహాలు పాటిస్తే క్షయ వ్యాధి గ్రస్తులకు ఆరు నెలల్లో నయం చేయవచ్చునని రైల్వేకోడూరు మెడికల్ ఆఫీసర్ బ్రహ్మకుమారీ తెలిపారు. మంగళవారం రైల్వేకోడూరు టీబీ యూనిట్‌లో ఉన్న పది మంది క్షయ వ్యాధిగ్రస్తులకు 6 నెలల పాటు కావాల్సి పోషక విలువలు కల్గిన ఆహారపు ప్యాకెట్లును పంపిణీ చేశారు. టీబీ యూనిట్ సిబ్బంది మురళి, చెన్నారెడ్డి, ఆసియా, జగన్ పాల్గొన్నారు.

సిబ్బంది చిత్తశుద్ధితో పనిచేయాలి: ఎంపీడీవో

ఒంటిమిట్ట, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : సచివాలయ సిబ్బంది చిత్తశుద్ధితో పనిచేయాలని ఎంపీడీవో కుళాయి బాబు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని సాలాబాదు, రాచగుడిపల్లె, పెన్నపేరూరు, గంగపేరూరు గ్రామ సచివాలయాలను తనిఖీ చేశారు. సోమవారం సాలాబాదు సచివాలయం సిబ్బంది ఉదయం 11 గంటల వరకు సచివాలయాన్ని తెరవలేదు. దీంతో సచివాలయ సిబ్బందికి ఎంపీడీవో సోకాజ్ నోటీసులను ఇచ్చారు. దీనిపై మంగళవారం సచివాలయాన్ని తనిఖీ చేసి షోకాజ్ నోటీసులపై సంజాయిషి ఇవ్వాలని ఆదేశించారు.


రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీవో

సీనియారిటీ జాబితాలో తప్పులను సరిచేయాలి

గాలివీడు, ఏప్రిల్22(ఆంధ్రజ్యోతి): సీనియారిటీ జాబితాలో తప్పులను సరిచేయాలని జిల్లా అధ్యక్షుడు నరసింహులు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం గాలివీడు మండలశాఖ కార్యవర్గ సమావేశం మంగళవారం గాలివీడులోని స్థానిక కార్యాలయంలో జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా అధ్యక్షుడు నరసింహులు మాట్లాడుతూ ఇటీవల విడుదల చేసిన సీనియారిటీ జాబితాలో తప్పులను సరిచేయాలని, ప్రచురించబడిన అన్ని క్యాటగిరీ/సబ్జెక్ట్‌ల సినియారీటీ జాబితాల్లో చాలా మంది ఉపాధ్యాయులు వారికి ర్యాంకు, మార్కులు గుర్తు లేనందు వలన చాలా మంది ఉపాధ్యాయులు రోస్టర్ ర్యాంకునే మెరిట్ ర్యాంకుగా భావించి నమోదు చేయించుకుని మంచి మెరిట్ ర్యాంక్ వచ్చిన వారికంటే జాబితాలోని వరుస క్రమంతో ముందు నిలిచారన్నారు. కావున ప్రతి ఒక్కరి మార్కులు, మెరిట్ ర్యాంకులను కూడా ఖాళీగా వదలక జాబితాలో పొందు పరచాలని కోరారు.

భూ రీసర్వే ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలి

రామాపురం, ఏప్రిల్22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు భూ రీసర్వేలను ప్రతిష్టాత్మకంగా, పారదర్శకంగా నిర్వహించాలని తహసీల్దార్ రామాంజనేయులు అన్నారు. గోపగుడిపల్లెలో భూములు రీసర్వేపై మంగళవారం ర్యాలీ నిర్వహించారు. సర్పంచులు సరోజమ్మ, ధనలక్ష్మి, నాయకులు చంద్రమౌళి, తిమ్మారెడ్డి, రేఖ నారాయణ బ్రదర్స్ పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి పంపిణీ

పెనగలూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పొందలూరు పంచాయతి పరిధిలో గల చక్రంపేటవాసి లేబాకు సాయికుమార్‌రెడ్డి అనే వ్యక్తికి మంగళవారం ప్రభుత్వవిప్, రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ 1,65,243 రూపాయల ముఖ్యమంత్రి సహాయనిధిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట టీడీపీ యువ నాయకులు ముక్కా సాయివికాస్‌రెడ్డి, స్థానిక నాయకులు దాసరి దామోదర్‌నాయుడు, కళాచంద్ర, ఆనందనాయుడు, క్లస్టర్ ఇన్‌ఛార్జి పి.రవికుమార్, సింగనమల సర్పంచ్ ఎర్రి శివకుమార్, సుదర్శన్‌చౌదరి, సురేష్‌రెడ్డి, కాకర్ల మల్లికార్జుననాయుడు, రామయ్య తదితరులు పాల్గొన్నారు.


సీఎం సహాయనిధిని అందజేస్తున్న ఎమ్మెల్యే అరవ శ్రీధర్

ఓబులవారిపల్లె : మండల పరిధిలోని ముక్కావారిపల్లె, చిన్నఓరంపాడు గ్రామ పంచాయతీల్లో అనారోగ్య బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి నిధులను ఎమ్మెల్యే, అరవ శ్రీధర్ అందజేశారు. ముక్కావారిపల్లె పంచాయతీ అమృతవారిపల్లె గ్రామానికి చెందిన అమృతాల కృష్ణవేణమ్మకు సుమారు రూ.48 వేలు అలాగే చిన్నఓరంపాడు పంచాయతీ అయ్యలరాజుపల్లెకు చెందిన మల్లు రమణారెడ్డికి వైద్య ఖర్చుల నిమిత్తం సుమారు రూ.2 లక్షలు అందజేశారు.

అంగన్వాడీ సేవలను వినియోగించుకోండి

సిద్దవటం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ సేవలను వినియోగించుకోవాలని గ్రామ సర్పంచ్ ప్రతినిధి మల్లు విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని మాచుపల్లె గ్రామం అంగన్వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సీడీపీవో శోభారాణి ఆదేశాల మేరకు పోషన్ పక్వాడా 7వ పౌష్టికాహార పక్షోత్సవాలను నిర్వహించారు. ప్రాథమిక పాఠశాల టీచర్లు శశికళ, అరుణకుమారి, సుబ్బరత్నమ్మ, అంగన్వాడీ వర్కర్‌లు వసుంధరదేవి, లక్ష్మీదేవి, మునెమ్మ, మల్లిక తదితరులు పాల్గొన్నారు.

'ఏఐవైఎఫ్ పోరాటాల ఫలితంగానే డీఎస్సీ నోటిఫికేషన్'

రాయచోటిటౌన్, ఏప్రిల్22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగుల పక్షాన అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) చేసిన నిరంతరం పోరాటాల ఫలితంగానే కూటమి ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేశారని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి జక్కుల వెంకటేశ్ అన్నారు. మంగళవారం ఆయన ఏఐవైఎఫ్ ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడుతూ వయో పరిమితి 44 నుంచి 47 సంవత్సరాలకు పెంచి సీనియర్ అభ్యర్థులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. అలాగే పరీక్ష గడువు 90 రోజులు ఇవ్వాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

పోషకాల గురించి గర్భిణులకు వివరించాలి

రైల్వేకోడూరు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): పోషకాల గురించి గర్భిణీ స్త్రీలకు వివరించాలని రైల్వేకోడూరు స్త్రీ శిశు సంక్షేమ శాఖ సీడీపీవో సౌభాగ్యమ్మ తెలిపారు. మంగళవారం రైల్వే కోడూరు తహశీల్దార్ సభాభవనంలో పోషణ పక్షోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ కార్యకర్తలు తమ పరిధిలో ఉన్న గర్భిణులకు పోషకాలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

భాకరాపేటలో నూతన విగ్రహాలు ఊరేగింపు

సిద్దవటం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): సిద్దవటం మండలం పెద్దపల్లె గ్రామ పంచాయతి బాకరాపేట గ్రామంలో భవానిశంకర దేవస్థానంలో నూతన విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా రెండో రోజు మంగళవారం ఉదయం ప్రభాతసేవ, ప్రధాన కలశ షోడశోపచార పూజలు, యంత్రాలకు, మూలవిరాట్‌లకు పూజలు, మంగళవారం సాయంత్రం భాకరాపేట గ్రామం పురవీధుల్లో ఊరేగించారు.


ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా తీసుకెళుతున్న భక్తులు

అబాకస్‌లో విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ

రైల్వేకోడూరు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి):అబాకస్‌లో రాణిస్తున్న పిల్లలకు గౌరీశంకర్ స్కూలు కరస్పాండెంట్ అదును కోట గోపీనాథ్ మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అబాకస్‌లో చిన్నపిల్లల నుంచి పెద్ద పిల్లల వరకు నేర్పించి పంపిస్తున్నామని తెలిపారు. 1వ తరగతి విద్యార్థులు నుంచి 10వ తరగతి విద్యార్థుల వరకు అబాకస్ రాణిస్తున్నారని తెలిపారు. ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.


గౌరీశంకర్ స్కూలు పిల్లలకు అబాకస్ సర్టిఫికెట్లు పంపిణీ చేసిన దృశ్యం

పోక్సో కేసులో యువకుడు అరెస్టు

రైల్వేకోడూరు రూరల్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): మైనర్ బాలికపై అత్యాచార యత్నం చేసి హత్య చేయాలని ప్రయత్నించిన యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు సీఐ హేమసుందర్ తెలిపారు. పోలీసుల వివరాల మేరకు... రాఘవరాజుపురం దళితవాడకు చెందిన యువకుడు కూనివెంకటేష్(శివమణి) ఈ నెల 19వ తేదీన మైనర్ బాలికపై అత్యాచారయత్నం చేసి హత్య చేయడానికి ప్రయత్నం చేశాడని బాలిక తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని మంగళవారం మైసూరివారిపల్లి వద్ద ఉన్న మార్కెట్ యార్డు వద్ద అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు. కోడూరు మేజిస్ట్రేట్ నిందితుడికి 14 రోజులు రిమాండ్ విధించినట్లు సీఐ హేమసుందర్ తెలిపారు.


నిందితుడితో పోలీస్ సిబ్బంది

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

రైల్వేకోడూరు రూరల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాధవరంపోడు పంచాయతీ పరిధీలోని కడప-చెన్నై ప్రధాన రహదారిలో మంగళవారం రెండు వాహనాలు ఢీకొనడంతో ఒకరు త్రీవంగా గాయపడ్డాడు. స్థానికులు అందించిన వివరాల మేరకు... అరటి కాయల లోడుతో చెన్నై వెళ్తున్న టాటాఏస్ వాహనం తిరుపతి నుంచి కడప వైపు వస్తున్న లారీని ఢీకొనడంతో టాటాఏస్ వాహనంలో ఉన్న డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు అతని 108 వాహనంలో కోడూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై విచారిస్తున్నట్లు ఎస్ఐ నవీన్ బాబు తెలిపారు.


వాహనంలో ఇరుక్కుపోయిన డ్రైవర్

రాజంపేటలో పురందేశ్వరి జన్మదిన వేడుకలు

రాజంపేట, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : మాజీ కేంద్ర మంత్రి రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి జన్మదినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మంగళవారం రాజంపేట బీజేపీ పార్లమెంట్ కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్ ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు సురేష్‌రాజు, రాష్ట్ర మైనార్టీ మోర్చ ఉపాధ్యక్షుడు షబ్బీర్ అహ్మద్, అసెంబ్లీ కోకన్వీనర్ రాంప్రసాద్, ఎస్సీ మోర్చ కార్యవర్గ సభ్యులు ఎం.రమణయ్య, బీజేపీ జిల్లా కార్యదర్శి కృష్ణయాదవ్, తోట శ్రీనివాస్, ప్రభావతి, తోట నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


కేక్ కట్‌చేస్తున్న బీజేపీ నాయకులు

25న మండల మీట్

లక్కిరెడ్డిపల్లె, ఏప్రిల్22 (ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశం ఈనెల 25వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో ఉషారాణి తెలిపారు. ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, జెడ్పీటీసీ రమాదేవి, మండలశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని ఆమె కోరారు.

'మిగులు ఉపాధ్యాయులను ఉన్నత పాఠశాలల్లోనే కొనసాగించాలి'


మాట్లాడుతున్న కొండూరు శ్రీనివాసరాజు

రాయచోటిటౌన్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 117 ఉత్తర్వులు రద్దు ద్వారా ఉన్నత పాఠశాలలో అనేక మంది గణితం, తెలుగు, ఆంగ్లం, సాంఘిక శాస్త్రం పాఠశాల సహాయకులు ఎక్కువ సంఖ్యలో మిగులు ఉపాధ్యాయులుగా తేలుతున్నందున వారిని అదే ఉన్నత పాఠశాలల్లోనే కొనసాగించే విధంగా చర్యలు తీసుకోవాలని నోబెల్ టీచర్స్ అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొండూరు శ్రీనివాసరాజు ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటిలో జరిగిన ఎన్‌టీఏ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నోబెల్ టీచర్స్ అసోషియేషన్ ముఖ్య నాయకులు వేణుగోపాల్‌రావు, మధుసూదన్‌రెడ్డి, నరసింహారెడ్డి, కొండూరు మురళీ మోహన్‌రాజు, కులశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

వృత్తి, విద్యా కోర్సులకు మెరుగైన భవిష్యత్

ఓబులవారిపల్లె, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : వృత్తి, విద్యా కోర్సులకు మెరుగైన భవిష్యత్ ఉందని ఎంపీడీవో ఎంపీడీవో మల్‌రెడ్డి పేర్కొన్నారు. కస్తూర్బా గాంధీ విద్యాలయంలో మంగళవారం హైస్కూల్, ఇంటర్ విద్యార్థులకు కుట్టుమిషన్లపై శిక్షణ ఇచ్చారు.

తిరుమలలో యువకుడి ఆత్మహత్య



తిరుమల, ఏప్రిల్22(ఆంధ్రజ్యోతి):తిరుమలలో మంగళవారం ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల వివరాల మేరకు.. వైకుంఠం క్యూకాంప్లెక్స్ సమీపంలోని ఏటీసీ వద్ద మరుగుదొడ్డిలో గణేష్ (16) అనే యువకుడు ఉరి వేసుకుని ఉండటాన్ని పారిశుధ్య కార్మికులు గుర్తించి పోలీసులు, విజిలెన్స్ అధికారులకు తెలియజేశారు. మృతదేహాన్ని తిరుపతి రుయాకు తరలించారు. మృతుడు రాయచోటికి చెందిన గణేష్‌గా పోలీసులు తేల్చారు. ఇతడి అన్న తిరుమలలోని టీస్టాల్‌లో పనిచేస్తున్నాడు. అడిగిన డబ్బు ఇవ్వలేదని మనస్తాపంతో గణేష్ ఆత్మహత్యకు పాల్పడినట్టు సమాచారం. కాగా మృతదేహాన్ని ఆగమేఘాల పై తిరుమలలోని అశ్విని ఆస్పత్రికి కాకుండా తిరుపతికి తరలించడంపై తొలుత అనుమానాలు వ్యక్తమయ్యాయి.

సర్టిఫికెట్ల పంపిణీ

రామాపురం, ఏప్రిల్22(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ సర్టిఫికెట్లను మంగళవారం హెచ్ఎం పుష్పలత అందజేశారు. కస్తూర్బాలో రుచి విద్య కోర్సులు సాధించిన విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు.

'బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొడదాం'

రాయచోటిటౌన్, ఏప్రిల్22(ఆంధ్రజ్యోతి):దేశంలో భారతీయ జనతా పార్టీ అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేఖ విధానాలను తిప్పికొడదామని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ అన్నమయ్య జిల్లా కార్యదర్శి మావులూరి విశ్వనాథ్ పిలుపునిచ్చారు. సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం ఆ యన రాయచోటి పట్టణంలోని బస్టాండు సమీపంలో పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1974లో పశ్చిమబెంగాల్‌లో నగ్జల్ బరి ప్రాంతంలో భూస్వామ్య విధానానికి వ్యతిరేకంగా పార్టీ ఏర్పాటైందని గుర్తు చేశారు. బడుగు, బలహీన వర్గాలు, భూమిలేని వారి కోసం సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీని ఏర్పాటు చేశారన్నారు. అందులో భాగంగానే బీహార్, ఛత్తీష్‌ఘడ్, జార్ఖండ్, మహారాష్ట్ర రాష్ట్రాల్లో శాసన సభ్యులను, పార్లమెంట్ సభ్యులను కలిగిన పార్టీ లిబరేషన్ పార్టీ అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ అన్నమయ్య జిల్లా కమిటీ సభ్యులు రమణ, రఘునాథ్‌నాయుడు, సుజాత, పార్టీ సభ్యులు పెద్దన్న, రామాంజి, చంద్ర తదితరులు పాల్గొన్నారు.


పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి విశ్వనాథ్

రైల్వేకోడూరు: సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని జిల్లా కమిటీ సభ్యుడు సిగె చెన్నయ్య ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. పార్టీ జెండా ను ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ భూస్వాములను వ్యతిరేకించి సీపీఐఎంఎల్ లిబరేషన్ పార్టీని స్థాపించారన్నారు. వామపక్షాల పార్టీలలో అగ్రగామి గా ఉందన్నారు. అందులో భాగంగా బీహార్, ఛత్తీసగఢ్, జార్ఖండ్, మహారాష్ట్ర రాష్ట్రాల్లో శాసనసభలు, పార్లమెంట్ సభ్యులు ఉన్నారని గుర్తు చేశారు.

పశు సంచార వైద్యశాలలకు 'రైట్ రైట్'

- నెలాఖరుకల్లా గ్రామాల్లో వైద్యసేవలు
- పాడి రైతులకు ఎంతో ఉపయోగం


మదనపల్లె పశువుల ఆస్పత్రిలో మూలనపడ్డ సంచార వైద్యసేవల వాహనం

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పశువులకు అత్యవసర వైద్య సేవలందించడానికి పశు సంచార వైద్యశాలలు ఎంతో ఉపయోగపడేవి. గత వైసీపీ ప్రభుత్వం వీటి నిర్వహణ, మందుల పంపిణీ తదితర విషయాల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో సంచార పశువైద్యశాలల సేవలు సగానికి సగం నిలిచిపోయాయి. వీటి ఆవశ్యకత గుర్తించిన ప్రస్తుత ప్రభుత్వం ఈనెలాఖరుకల్లా పశు సంచార వైద్యశాలలను పునఃప్రారంభించేందుకు చర్యలు తీసుకుంది.

1962 టోల్‌ఫ్రీ నెంబర్‌తో...

108 తరహాలోనే 1962 నెంబర్‌కు పాడి రైతులు ఫోన్ చేస్తే వారి గ్రామాలకు పశు సంచార వైద్యశాలలు వెళతాయి. అక్కడ పశువులకు ప్రాథమిక చికిత్సలు, చిన్న చిన్న శస్త్రచికిత్సలు అందించి వస్తాయి. ఒకవేళ ఆవుకు అత్యవసర చికిత్స అవసరమైతే ఈ వాహనంలో ఉండే హైడ్రాలిక్ లిఫ్ట్ ద్వారా ఆవును ఈ వాహనంలోనే ఎక్కించి, నియోజకవర్గ కేంద్రంలోని పశువుల ఆస్పత్రికి తరలించి మెరుగైన వైద్యచికిత్సలు అందిస్తారు. జిల్లాలోని ఆరు నియోజకవర్గాలకు 6 పశు సంచార వైద్యశాలలు మంజూరు కాగా మొదటి దశలో రెండేళ్ల అగ్రిమెంట్ కింద ఓ సంస్థ నిర్వహణ బాధ్యతలు తీసుకుని నిర్వహించింది. గత డిసెంబరులో ఈ అగ్రిమెంట్ పూర్తి కావడంతో డిసెంబరు నుంచి ఈ వాహనాలు నిలిచిపోయాయి. దీంతో పశువులకు వైద్యసేవలు అందకుండా పోయాయి. అంతే కాకుండా వైసీపీ పాలనలో ఈ వైద్యసేవల వాహనాల్లో అవసరమైన మందులు సరఫరా చేయలేదనే ఆరోపణలతో పాటు, విధులు నిర్వహించే సిబ్బందికి ఐదు నెలల పాటు వేతనం మంజూరు చేయలేదు. 2023 సంవత్సరం రెండో దశలో ప్రారంభించిన ఏడు పశు సంచార వైద్యశాల వాహనాలు ఇప్పటికీ తిరుగుతూనే ఉండటంతో కొద్దో గొప్పో పశువులకు వైద్యసేవలు అందుతున్నాయి.

ప్రభుత్వం చర్యలు

జిల్లాలో పశు సంచార వైద్యశాల సేవలను పునఃప్రారంభించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 340 సంచార పశువైద్యసేవల వాహనాలను నిర్వహణకు టెండర్లు పిలిచింది. ఈ టెండర్లలో హెచ్ 1గా నిలిచిన భవ్య సంస్థకు ప్రభుత్వం కాంట్రాక్టు అప్పగించింది. ఒక్కో వాహనం నిర్వహణకు నెలకు రూ.1,64,500 చొప్పున ప్రభుత్వం చెల్లించనుంది. ఈ క్రమంలో ఈ వాహనంలో వెటర్నరీ సైన్సు హౌస్‌సర్జన్ చేసిన ఓ వైద్యుడు, డిప్లొమో చేసిన కాంపౌండర్, డ్రైవర్ కమ్ అటెండర్ ఉంటారు. కాల్ సెంటర్‌కు ఫోన్ వచ్చిన వెంటనే వారి దిశానిర్దేశం మేరకు ఆయా గ్రామాలకు వెళ్లి పశువులకు వైద్యసేవలు అందిస్తారు. వైద్యుడికి రూ.30 వేల నుంచి రూ.40 వేలు, కాంపౌండర్‌కు రూ.20 వేలు, డ్రైవర్ కమ్ అటెండర్‌కు రూ.10,500 వేతనాలు చెల్లిస్తారు.

అందుబాటులో వైద్యసేవలు

పశు సంచార వైద్యశాలలో పశువులకు సంబంధించి రక్త పరీక్షలు, మూత్రం, పేడ పరీక్షలు, పాలు పరీక్షలు నిర్వహించడానికి మైక్రోస్కోప్ ఉంటుంది. నట్టల నివారణకు తినిపించే మందు, డీ-వార్మింగ్ మందులు వ్యాక్సినేషన్, ప్రథమ చికిత్స మందులు, చిన్నచిన్న శస్త్రచికిత్సల పరికరాలు అందుబాటులో వుంటాయి.

మూలన పడ్డ ఆరు వాహనాలు

జిల్లాలోని ఆరు నియోజకవర్గాలకు మొదటి దశలో మంజూరైన ఆరు పశు సంచార వైద్యసేవల వాహనాలు డిసెంబరు నాటికి కాంట్రాక్టు ముగియడంతో నిలిచిపోయాయి. అప్పటి నుంచి ఆయా పశువైద్యశాలల ఆవరణంలో మూలన నిలిపి ఉంచారు. వాహనాల నిర్వహణ లేకపోవడంతో బ్యాటరీలు డెడ్ అయ్యాయి. టైర్లతో గాలి తగ్గిపోయి, రోడ్డు మీద తిరిగే పరిస్థితి కనిపించడం లేదు. ఈ వాహనాలు రోడ్లపైకి రావాలంటే మరమ్మతులు తప్పనిసరి.

13 వాహనాలతో వైద్యసేవలందిస్తాం

జిల్లాలోని ఆరు నియోజకవర్గాల్లో పశువులకు గ్రామాలకు వెళ్లి వైద్యసేవలందించేందుకు ఈనెలాఖరుకు 13 వాహనాలు సిద్ధం చేస్తున్నాం. కాంట్రాక్టు దక్కించుకున్న సంస్థ ప్రతినిధులు ఇప్పటికే నిలిచిపోయిన ఆరు వాహనాల ఫిట్‌నెస్ పరీక్షించి, చిన్నచిన్న రిపేర్లు ఉంటే చేయిస్తున్నారు. ప్రస్తుతం తిరుగుతున్న ఏడు వాహనాలతో పాటు మిగిలిన ఆరు వాహనాలు సిద్ధం చేసి పశువులకు సంచార వైద్యశాల నుంచి వైద్యసేవలందిస్తాం.

- డాక్టర్ గుణశేఖర్ పిళ్లై,
పశుసంవర్థకశాఖ జిల్లా అధికారి, రాయచోటి.

క్రమశిక్షణ, సేవాభావానికి ప్రతీక స్కౌట్

- డీఈవో సుబ్రమణ్యం



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఈవో సుబ్రమణ్యం

రాయచోటిటౌన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో చిన్ననాటి నుంచే క్రమశిక్షణతో పాటు దేశభక్తి, సామాజిక సేవా భావాలను పెంపొందించడానికి బాలభటుల ఉద్యమం (స్కౌట్స్ అండ్ గైడ్స్) ఎంతగానో తోడ్పడుతుందని జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రమణ్యం అన్నారు. మంగళవారం రాయచోటి పట్టణంలోని ఎస్ఎన్ కాలనీలో గల కో-ఆపరేటివ్ కాలనీ ప్రాథమిక పాఠశాలలో స్కౌట్ నూతన యూనిట్‌ను డీఈవో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయచోటిలోని ప్రాథమిక పాఠశాలలో మొట్టమొదటిసారిగా కబ్ (బాలురు), బుల్ బుల్ (బాలికలు) యూనిట్లు ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ఇందుకు చొరవ చూపిన ఫ్లాక్ లీడర్ ధనలక్ష్మికి ప్రత్యేకంగా అభినందనలు తెలియజేస్తున్నామన్నారు. ప్రతి పాఠశాలలో స్కౌట్ యూనిట్‌ను తప్పనిసరిగా ఏర్పాటు చే యాలన్నారు. స్కౌట్‌లో చేరడం ద్వారా విద్యార్థి దశ నుంచే తల్లిదండ్రులతో, గురువులతో మర్యాద పూర్వకంగా వ్యవహరిస్తూ సమాజం పట్ల బాధ్యతగా వ్యవహరించడానికి అవకాశం ఏర్పడుతుందన్నారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ ట్రైనింగ్ పొందిన విద్యార్థులకు శారీరక దారుఢ్యంతో పాటు బంగారు భవిష్యత్తు సమకూరుతుందన్నారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించడం ద్వారా ప్రపంచ స్థాయి పౌరులుగా ఎదిగేందుకు ఇది ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ అసోషియేషన్ జిల్లా కార్యదర్శి మడితాటి నరసింహారెడ్డి, పాఠశాల హెడ్ టీచర్ వీరమ్మ, యూనిట్ లీడర్ మడితాటి ధనలక్ష్మి, విద్యా కమిటీ చైర్మెన్ వహిదా, ఉపాధ్యాయులు వెంకటయ్య, రాధమ్మ, విమలకుమారి, చెంచురెడ్డి, లీలావతమ్మ, సరితమ్మ, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఈకేవైసీ చేయకపోతే రేషన్ కార్డులు గల్లంతే

- సబ్ కలెక్టరు మేఘస్వరూప్


రెవెన్యూ అధికారులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

కలికిరి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): రేషన్‌కార్డులకు ఈకేవైసీ చేసే ప్రక్రియ ఎట్టి పరిస్థితుల్లోనూ ఈనెలాఖరుకు పూర్తి చేయాలని మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ స్పష్టం చేశారు. కేవైసీ పూర్తి కాని రేషను కార్డులు నిరర్థకమవుతాయని, రేషన్ సరుకులు కూడా వారికి పంపిణీ కాబోవని ఆయన చెప్పారు.

మంగళవారం స్థానిక సైనిక పాఠశాలలో జరిగిన యూఎల్‌టీ సమావేశానికి హాజరయ్యా రు. అది పూర్తయిన అనంతరం ఎమ్మార్వో కార్యాలయంలో తహసీల్దారు, వీఆర్వోలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పేదలు ఆక్రమించుకున్న స్థలాలను క్రమబద్ధీకరించే వెసులుబాటును క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించి క్రమబద్ధీకరించుకునే విధంగా అవకాశం కల్పించాలని చెప్పారు. చెరువుల ఆ యకట్టు ద్వారా సాగయ్యే భూములకు నీటి తీరువా వసూళ్ల కోసం డిమాండ్లు తయారు చేసి సిద్ధంగా ఉంచాలని తెలిపారు. ప్రజా వేదిక ద్వారా వచ్చే అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. సమావేశంలో తహసీల్దారు మహేశ్వరీబాయి, వీఆర్వోలు పాల్గొన్నారు.

దళితులకు ఎక్కడా అన్యాయం జరగకూడదు


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): దళితులకు ఎక్కడా అన్యాయం జరగరాదని, జిల్లాలో సామాజిక రుగ్మతలను సమూలంగా తొలగించడమే లక్ష్యంగా పాదర్శకంగా, నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ అధ్యక్షతన సాంఘీక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ సంబంధించిన కేసుల్లో బాధితులకు న్యాయంతో పాటు త్వరితగతిన పరిహారం అందించేందుకు చర్యలు తీసుకోవాలని సబ్ కలెక్టర్లు ఆర్డీవోను అడిషనల్ ఎస్పీని, డీఎస్పీలను ఆదేశించారు. దళితుల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల అవకాశాలను కల్పిస్తోందని పేర్కొన్నారు.

ప్రతి మండలంలో ఆఖరి శనివారం రోజున సివిల్ రైట్స్‌డే తప్పకుండా జరిపి దానికి సంబంధించిన నివేదికను సమర్పించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, మదనపల్లి సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్, డీఆర్‌వో మధుసూదన్‌రావు, జిల్లా సాంఘీక సంక్షేమశాఖ అధికారి జయప్రకాశ్, రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్, రాజంపేట, మదనపల్లె డివిజన్ల డీఎస్పీలు, డీవీఎంసీ కమిటీ సభ్యులు, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బాలింత మృతిపై కేసు నమోదు

బి.కొత్తకోట, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఓ బాలింత మృతిపై కేసు నమోదు చేసినట్లు సీఐ జీవన్‌గంగనాథ్‌బాబు తెలిపారు. మండలంలోని కోటావూరు పంచాయతీ బూదలవారిపల్లెకు చెందిన గాయత్రి(25)తన భర్త రాజేష్‌తో కలిసి బెంగళూరులో నివాసం వుంటోంది. ఇటీవల బి.కొత్తకోట ప్రభుత్వాసుపత్రిలో కాన్పు అవడంతో పాటు ట్యూబెక్టమీ ఆపరేషన్ చేయించుకుంది. తీవ్రమైన కడుపునొప్పి రావడంతో చికిత్స చేయించుకుంది. అయినా తగ్గక పోవడంతో వైద్యులు మదనపల్లెకు రెఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో ఆమె సోమవారం మృతి చెందింది. దీనిపై విచారణ చేయాలంటూ మృతురాలి అన్న రెడ్డిప్రవీణ్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ జీవన్ గంగనాథ్‌బాబు తెలిపారు.

ద్విచక్ర వాహనం కాల్చివేత


రంగనాయకులపేటలో కాలిపోయిన స్కూటర్

రైల్వేకోడూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రంగనాయకుల పేటలో అఫ్సర్ అనే వ్యక్తికి చెందిన ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు కాల్చివేశారని మంగళవారం రైల్వేకోడూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుడు మీడియాతో మాట్లాడుతూ ఇంట్లో తాము నిద్రిస్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి తన స్కూటర్‌ను కాల్చివేసినట్లు తెలిపాడు. తనకు న్యాయం చేయాలని పోలీసులను కోరడంతో వారు విచారిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో బాలిక మృతి


యశశ్విత (ఫైల్)

రాయచోటిటౌన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణ పరిధిలోని ఏజీ గార్డెన్ సమీపంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యశశ్విత (8) అనే బాలిక మృతి చెందింది. పోలీసుల కథనం మేరకు... చిన్నమండెం మండలం చాకిబండ కురవపల్లెకు చెందిన కోటకొండ రామదాసు, సుజాత దంపతులు రాయచోటి పట్టణంలో ఇల్లు నిర్మించుకుంటున్నారు. వీరికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. యశశ్విని మూడో సంతానం. మంగళవారం రాయచోటి- చిన్నమండెం మార్గంలోని ఏజీ గార్డెన్, గొర్లముదివేడు క్రాస్‌కు మధ్యలో దుకాణాల వద్ద తండ్రీకూతురు రోడ్డు దాటు తుండగా చిన్నమండెం వైపు నుంచి రాయచోటి వస్తున్న బొలేరో వాహనం వేగంగా వచ్చి ఢీకొంది. దీంతో యశశ్విత మృతిచెందింది. ఈ మేరకు రాయచోటి ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వీడీవో క్వార్టర్స్ అక్రమాలను తొలగించండి


ఆక్రమణలను పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో రవికుమార్‌నాయుడు

- జడ్పీ సీఈవో రవికుమార్‌నాయుడు

గుర్రంకొండ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో వీడీవో క్వార్టర్స్ అక్రమాలను తొలగించాలని మంగళవారం చిత్తూరు జిల్లా జడ్పీ సీఈవో రవికుమార్‌నాయుడు అధికారులకు సూచించారు. పట్టణంలోని కడప-బెంగుళూరు జాతీయ రహదారిపై ఉన్న వీడీవో క్వార్టర్స్ భవనం కొన్నేళ్లుగా ఖాళీగా ఉంటూ పాడుపడిందని, గత వైసీపీ ప్రభుత్వం హయాంలో కొందరు నాయకులు ఆక్రమించుకొని అందులో రేకుల షెడ్లను ఏర్పాటు చేసి వ్యాపారాలు చేస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో వీడీవో క్వార్టర్స్ స్థలం ఆక్రమణలపై గ్రామస్థులు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో జడ్పీ సీఈవో ఆక్రమణలను పరిశీలించారు. అనంతరం ఆక్రమాలను తొలగించాలని ఎంపీడీవో వెంకటేశులకు సూచించారు. ఆక్రమాలను తొలగించిన వెంటనే అందులో షాపింగ్ రూములు నిర్మించేందుకు నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో రికార్డులను పరిశీలించి ఉద్యోగుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏవో నాగశివారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం సీజ్

పెద్దమండ్యం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని కలిచెర్లలో అక్రమంగా రాయచోటికి తరలిస్తున్న 417 రేషన్ బియ్యం బస్తాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పీవీ రమణ తెలిపారు. రాయచోటిటౌన్‌కు చెందిన చాంద్‌బాష టాటా సుమోలో అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న వాహనాన్ని, బియ్యం బస్తాలను సీజ్ చేసి నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నడి రోడ్డుపై వైసీపీ నేత జన్మదిన వేడుకలు

- ఆరుగురిపై కేసు నమోదు

పీలేరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): అధికారం కోల్పోయినా వైసీపీ నేతల ఆగడాలకు అంతు ఉండడం లేదు. అధికారంలో ఉండగా ప్రవర్తించినట్లుగానే ఇప్పుడూ బాధ్యతారాహిత్యంగా ప్రవర్తిస్తున్నారు. అందుకు పీలేరులో మంగళవారం జరిగిన సంఘటన తాజా సాక్ష్యంగా నిలుస్తోంది. పీలేరు పట్టణానికి చెందిన వైసీపీ నేత, రాజంపేట పార్లమెంటరీ యూత్ విభాగం ప్రధాన కార్యదరి కృష్ణ చైతన్య రెడ్డి మంగళవారం తన జన్మదినం జరుపుకున్నారు. అదీ మందీ మార్బలంతో పీలేరు-కడప ప్రధాన రహదారిపై కార్లు, స్కూటర్లు అడ్డుపెట్టి మరీ కేక్‌లు కట్ చేయడమే కాకుండా పెద్దఎత్తున బాణాసంచా పేల్చారు. ట్రాఫిక్‌కు అంతరాయంగానే కాకుండా అక్కడున్న వారి ప్రవర్తన ఇబ్బందికరంగా ఉండడంతో స్థానికులు పీలేరు అర్బన్ పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పీలేరు అర్బన్ సీఐ యుగంధర్ సంఘటనా స్థలానికి చేరుకుని కృష్ణచైతన్య రెడ్డితోపాటు చాంద్‌బాషా, శేఖర్‌రెడ్డి, విష్ణు ప్రభు, నవీన్ కుమార్ రెడ్డి, వినోద్‌లతోపాటు మరికొంత మందిపై కేసు నమోదు చేశారు. ఒక కారుతో సహా మోటారు సైకిల్‌ను సీజ్ చేశారు.

పుష్కరకాలంగా ఎదురుచూపు

- ఇళ్ల పట్టాల కోసం ఆర్టీసీ కార్మికుల నిరీక్షణ
- రూ.రెండు కోట్లు వసూలు చేసినా చేతికందని పట్టాలు
- గత ప్రభుత్వంలో ప్లాట్లు వేసి స్లిప్పులు పంచిపెట్టారు
- ఈ ప్రభుత్వంలోనైనా పట్టాలు చేతికందేనా అంటూ కార్మికుల ఎదురుచూపులు

పీలేరు రూరల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : వారంతా ఆర్టీసీ కార్మికులు రేపో మాపో ఇంటి స్థలాలకు పట్టాలు ఇచ్చేస్తారు.... సొంత ఇంటి కల నెరవేరుతుందని కోటి ఆశలతో అధికారులు చెప్పే మాయమాటలు నమ్మి పుష్కర కాలంగా ఎదురు చూస్తూనే ఉన్నారు. పనైంది... పట్టాలు ఇవ్వడమే తరువాయి అంటూ నాటి నుంచి నేటి వరకూ కార్మికులను వంచిస్తూనే ఉన్నారు. ఇంకెంత కాలం వేచి ఉండాలో అర్థం కాక కార్మికులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. ఒక్కో కార్మికుడి వద్ద నుంచి రూ.40 వేలు చొప్పున రెండు కోట్లు వసూలు చేసినా ఇంకా పట్టాలు చేతికందకపోవడంతో తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికే ఇంటి స్థలం కోసం డబ్బులిచ్చిన కార్మికులలో పలువురు పదవీ కూడా విరమణ చేశారు. పీలేరు ఆర్టీసీ డిపోలో సుమారు 500 మంది కార్మికులు పనిచేస్తున్నారు. వీరిలో 480 మందితో 2013 అక్టోబరు 21న ఏపీఎస్‌ఆర్టీసీ హౌసింగ్ సొసైటీ ఏర్పాటు చేశారు. సొంతంగా ఇల్లు నిర్మించుకునేందుకు స్థల సేకరణ కోసం ఒక్కో కార్మికుడి వద్ద రెండు విడతలలో రూ.40 వేలు చొప్పున వసూలు చేశారు. కార్మికుల నుంచి వసూలు చేసిన డబ్బులో రూ.1.21 కోట్లతో పీలేరు మండలం ఎర్రగుంట్లపల్లె పంచాయతీ పరిధిలోని నెట్టిబండ సమీపంలో సర్వే నెంబర్లు-774-2లో 4.72 ఎకరాలు, 657-4లో 2.60 ఎకరాలు, 655-బీ5లో 2.85 ఎకరాలు, 657-6లో 1.52 ఎకరాలు, 657-3లో 1.50 ఎకరాలు, 657-7లో 20 సెంట్లు, 776-2లో 32.38 ఎకరాలు, ఇలా పలువురి వద్ద 15.77 ఎకరాల డీకేటీ భూములు కొన్నారు. అనంతరం 13 మంది సభ్యులతో హౌసింగ్ సొసైటీ కమిటీ ఏర్పాటు చేశారు.

కేసులు...అరెస్టులు...

పలువురి రైతుల వద్ద భూములు కొన్నా వాటిని కార్మికులకు చూపకపోవడంతో కొందరు సొసైటీ సభ్యులపై తీవ్ర ఒత్తిడి తీసుకొచ్చారు. సొసైటీ జనరల్ బాడీ సమావేశాలు నిర్వహించడం లేదని, ఎటువంటి సమాచారం ఇవ్వడం లేదని ఆరోపిస్తూ కొందరు పీలేరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మరోవైపు ఆర్టీసీ నిబంధనల ప్రకారం సంస్థ పేరుతో ఎటువంటి లావాదేవీలు నిర్వహించరాదు. అయితే సంస్థ అనుమతి లేకుండానే అప్పట్లో ఇక్కడ పనిచేస్తున్న ఓ అధికారి ఇష్టానుసారంగా వ్యవహరించి సంస్థ పరువు బజారుకీడుస్తున్నారని కార్మికులు పోలీసులకిచ్చిన ఫిర్యాదులో పేర్కొనడం గమనార్హం. ఇంతటితో ఊరుకోని కార్మికులు ఎస్పీ, ఆర్టీసీ ఎండీకి ఫిర్యాదు చేయడంతో పాటు కోర్టులో కేసులు వేయడం, పలువురు సభ్యులను అరెస్ట్ చేయడం, బెయిల్‌పై బయటకు రావడం జరిగిపోయాయి. దీంతో కార్మికుల్లో సర్వత్రా ఉత్కంఠ, ఆందోళన నెలకొంది. వైసీపీ ప్రభుత్వంలో కొందరు ఆర్టీసీ కార్మిక సంఘ నాయకుల అప్పటి జిల్లా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో సంప్రదించి ఎలాగైనా ఆర్టీసీ కార్మికులకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని ఒత్తిడి తీసుకొచ్చారు. దీంతో కార్మికులు పలువురు రైతుల వద్ద కొన్న 15.77 ఎకరాలు ఉంది, అందులో అందరికీ పట్టాలు ఇద్దామని భరోసా ఇచ్చారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆర్టీసీ నగర్ పేరుతో కార్మికులు కొన్న స్థలాన్ని చదును చేయించి లేఔట్ వేశారు. ఇక్కడే కార్మికులందరికీ ఇళ్ల పట్టాలు ఇస్తామని నమ్మించి కార్మికులతో సమావేశం ఏర్పాటు చేసి పట్టాలు ఇవ్వకుండా కేవలం ప్లాట్ నెంబర్ ఉన్న స్లిప్పులు ఇచ్చి చేతులు దులుపుకున్నారు. మరోవైపు కోర్టులో పెండింగ్ కేసులు పరిష్కారం కాకపోవడంతో కార్మికుల సొంతింటి కల స్లిప్పులకే పరిమితమైంది. కోర్టులో ఉన్న కేసుల పరిష్కారం కోసం కొందరు యూనియన్ నేతలు భారీ మొత్తంలో డబ్బులు డిమాండ్ చేస్తున్నారన్న విమర్శలు లేకపోలేదు. పుష్కర కాలం గడచిపోయింది. ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దలు వాస్తవ పరిస్థితులను గుర్తించి తమకు కేటాయించిన ప్లాట్లలో ఇంటి పట్టాలు ఇప్పించి తమను ఆదుకోవాలని పలువురు కార్మికులు కోరుతున్నారు.


పీలేరు మండలం నెట్టిబండ వద్ద ఇళ్ల స్థలాల కోసం ఆర్టీసీ కార్మికులు రైతుల వద్ద కొన్న భూమి


వైసీపీ హయాంలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆర్టీసీ నగర్ పేరున వేసిన శిలాఫలకం

కార్మికులకు న్యాయం చేస్తాం...



కార్మికులు ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న ఇళ్ల పట్టాలు ఇప్పించి వారికి న్యాయం చేస్తాం. ఇందు కోసం పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డితో సంప్రదిస్తాం. వీలైనంత త్వరగా కార్మికుల చిరకాల వాంఛ నెరవేర్చడం కోసం ఉన్న అడ్డంకులను సామరస్యంగా పరిష్కరిస్తాం. ఇళ్ల పట్టాల కోసం ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదు. కార్మికులకు అండగా ఉంటాం.

-శ్రీనాథరెడ్డి,
ఈయూ పీలేరు డిపో గౌరవాధ్యక్షుడు, పీలేరు.

అందరికీ పట్టాలు ఇప్పించడమే లక్ష్యం...



చాలీచాలని జీతాలతో ఇబ్బందులు పడుతున్న ఆర్టీసీ కార్మికులందరికీ పట్టాలు ఇప్పించడమే లక్ష్యం. ఇప్పటికే ఈ దిశగా ముందుకుపోతున్నాం. ఇందుకు అవసరమైన సమస్యల పరిష్కారం కోసం కార్మికులంతా సమిష్టిగా ముందుకు పోతాం. కార్మికులెవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదు. కాస్త ఆలస్యమైనా అందరికీ న్యాయం చేస్తాం.

-పీఎస్ఎం రాజు,
ఎన్ఎంయూ జిల్లా ప్రధాన కార్యదర్శి, పీలేరు.

అధైర్య పడాల్సిన అవసరం లేదు....



పీలేరు డిపోలో పనిచేస్తున్న ఆర్టీసీ కార్మికులు అధైర్యపడాల్సిన అవసరం లేదు. అందరికీ న్యాయం చేస్తాం. సమస్యను ఎమ్మెల్యే కిశోర్‌కుమారొరెడ్డి దృష్టికి తీసుకెళ్లాం. ఇప్పటికే ఆలస్యమైంది. గత పాలకులు సక్రమంగా పట్టించుకోకపోవడం వల్లే ఇబ్బందులు. అందరికీ ఇళ్ల పట్టాలు ఇప్పించడం తక్షణ కర్తవ్యం.

- వై.రెడ్డెప్పరెడ్డి,
ఎన్ఎంయూ పీలేరు డిపో గౌరవాధ్యక్షుడు

హైస్కూల్ ప్లస్‌కు స్వస్తి

- జూనియర్ కళాశాలలుగా మార్చాలనే యోచన
- మండలానికి ఒక కళాశాల ఉండేలా చర్యలు
- వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఏర్పాటు
- యథాతథంగా కొనసాగించాలని ఉపాధ్యాయుల డిమాండ్



కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉన్న హైస్కూ ల్ ప్లస్‌లు వచ్చే విద్యా సంవత్సరం నుంచి కొనసాగుతాయా లేదా అనే సందిగ్ధత నెలకొంది. వీటి కొనసాగింపుపై ఇప్పటికే ఉన్నతాధికారులు పరోక్షంగా పలుమార్లు ఉపాధ్యాయ సంఘాలతో జరిగిన చర్చలలో స్పష్టత ఇచ్చారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి హైస్కూల్ ప్లస్‌లను తొలగించి వాటి స్థానంలో జూనియర్ కళాశా లలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కానీ ఉపాధ్యాయులు మాత్రం వాటిని యదాతథంగా కొనసాగించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు పలు ఉపాధ్యాయ సంఘాల నేతలు వినతిపత్రాలను కూడా అందజేశారు.

ఉమ్మడి కడప జిల్లాలో 28 హైస్కూల్ ప్లస్‌లు ఉన్నాయి. వీటిని తొలగిస్తామని అధికారులు మౌఖిక ఆదేశాలు జారీ చేయ డంతో అందులో పనిచేసే సిబ్బంది డైలమాలో పడ్డారు. గత ప్రభు త్వం 2022లో 10 హైస్కూల్ ప్లస్‌లను (మహిళా జూనియర్ కళా శాలలు) ఏర్పాటు చేసి కేవలం బాలికలకు అవకాశం కల్పించారు. వీటికి అదనంగా 2024-25 విద్యా సంవత్సరం నుంచి మరో 18 హైస్కూల్ ప్లస్‌లను ఏర్పాటు చేస్తూ ఎన్నికల ముందు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఉమ్మడి కడప జిల్లాలో 28 హైస్కూల్ ప్లస్‌లు ఉండగా.. వాటిలో 14 మాత్రమే కొనసాగుతున్నాయి.

మండలాల్లో జిల్లా పరిషత్ పాఠశాలలను మెర్జ్ చేసి హైస్కూల్ ప్లస్ పేరిట ఇంటర్మీడియట్‌ను పరిమితమైన గ్రూపులతో సిబ్బంది కొరతతో జడ్పీ హైస్కూల్లోనే నిర్వహిస్తున్నారు. గతంలో ఏర్పాటు చేసిన పది హైస్కూల్ ప్లస్‌లలో పూర్తి స్థాయిలో సిబ్బంది, గ్రూపులను ఏర్పాటు చేయకుండానే మళ్లీ 18 ఏర్పాటు చేయడంతో విమర్శలు వెల్లువెత్తాయి. ఎన్నికల ముందు 18 కోఎడ్యుకేషన్ హైస్కూల్ ప్లస్‌లను ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన గత ప్రభుత్వం అందులో సిబ్బందిని మాత్రం నియమించలేదు. దీనిపై ఉపాధ్యాయులు అనేకమార్లు అధికారులకు విజ్ఞప్తి చేసిన ఫలితం లేకపోయింది. హైస్కూల్ ప్లస్‌ల నిర్వహణలో తీసుకున్న అనాలోచిత నిర్ణయాలతో విమర్శలు వెల్లువెత్తాయి. గత రెండేళ్లుగా ఇంటర్ ఫస్ట్ యర్, సెకండియర్ ఫలితాల్లో విద్యార్థులు దారుణంగా ఫెయిల్ అయ్యారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం పాఠశాలలతో పాటు హైస్కూల్ ప్లస్‌లను ప్రక్షాళన చేయాలని నిర్ణయించింది.

హైస్కూల్ ప్లస్ సిబ్బందిలో గుబులు

వచ్చే విద్యా సంవత్సరం నుంచి హైస్కూల్ ప్లస్‌లను తొలగిస్తారంటూ ప్రచారం జరుగుతుండడంతో వాటిలో పనిచేసే సిబ్బందిలో గుబులు పుడుతోంది. వాస్తవానికి గత ప్రభుత్వం మొదట 10 హైస్కూల్ ప్లస్‌లు ఏర్పాటు చేసినప్పుడు వారికి పాఠాలను బోధించడానికి పాఠశాల విద్యలోని ఆయా యాజమాన్యాలలో పనిచేసే అర్హులైన స్కూల్ అసిస్టెంట్లను పీజీటీలుగా పదోన్నతులు ఇచ్చి నియ మించారు. అయితే ఇపుడు ఈ హైస్కూల్ ప్లస్‌లు జూనియర్ కళాశాలలుగా రూపాంతరం చెందిన తర్వాత అక్కడ పనిచేసే ఉపాధ్యాయులను తిరిగి వెనక్కి అంటే పూర్వం పనిచేసే పాఠశా లలకు స్కూల్ అసిస్టెంట్లుగా పంపుతామని అధికారులు ఉపాధ్యా య సంఘాల నేతలకు చెబుతున్నారు. దీంతో హైస్కూల్ ప్లస్ సిబ్బంది అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. హైస్కూల్ ప్లస్‌లను జూని యర్ కళాశాలలుగా ఏర్పాటు చేసినా.. తదుపరి జిల్లా పరిషత్ పాఠశాలల్లో పనిచేసే అర్హత కలిగిన స్కూల్ అసిస్టెంట్లు, హెచ్‌ఎంలకు పీజీటీలుగా పదోన్నతులు ఇవ్వాలని కోరుతున్నారు.

తలనొప్పిగా మారిన జీఓ 302, 223

ప్రస్తుతం ఉన్న హైస్కూల్ ప్లస్‌లను జూనియర్ కళాశాలలుగా మారిస్తే నిబంధనల ప్రకారం జీఓ 302, 223లను అనుసరించి సిబ్బంది నయామక ప్రక్రియను చేపట్టాల్సి ఉంది. ఈ నిబంధనల ప్రకారం పాఠశాల విద్యలో పనిచేసే ఉపాధ్యాయులను నియమించే అవకాశం లేకపోవడంతో ఉపాధ్యాయులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో లెక్చరర్ల నియామకానికి 1979 నుంచి ప్రభుత్వాలు తీసుకువచ్చిన జీఓలు ఇలా ఉన్నాయి. జీఓ 939 ప్రకారం జిల్లా పరిషత్, మున్సిపల్ టీచర్లకు 25శాతం, ప్రభుత్వ టీచర్లకు 25శాతం పదోన్నతుల కోటాలో భర్తీ చేయాలి. మిగిలిన 50శాతం మందిని డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా తీసుకోవాలి. 1993లో తీసుకువచ్చిన 302 జీవో ప్రకారం 50శాతం డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా, 40శాతం జిల్లా పరిషత్, ప్రభుత్వ టీచర్లను పదోన్నతుల ద్వారా భర్తీ చేయాల్సి ఉంది. మిగిలిన 10శాతం నాన్ టీచింగ్ స్టాఫ్ ద్వారా భర్తీ చేయాలి. ఇందులో గతంలో ఉన్న మున్సిపల్ టీచర్స్ 25శాతం కోటాను తొలగించారు. ఆ తదుపరి 2008లో తీసుకువచ్చిన 223 జీవో ప్రకారం 90శాతం డైరెక్ట్ రిక్రూట్‌మెంట్, 10 శాతం నాన్ టీచింగ్ స్టాఫ్‌కు పదోన్నతుల ద్వారా భర్తీ చేయాల్సి ఉంది. ఇందులో అప్పటి వరకు జిల్లా పరిషత్, ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఉన్న 40శాతం కోటాను తొలగించారు. ఇలా జీఓ 302లో మున్సిపల్ టీచర్ల కోటాను, జీఓ 223లో జిల్లా పరిషత్, ప్రభుత్వ టీచర్ల కోటాను తొలగించారు. ఇపుడు జీఓ 223ను తొలగించాలని జిల్లా పరిషత్ ఉపాధ్యాయులు డిమాండ్ చేస్తుండ డంతో పాటు మున్సిపల్ ఉపాధ్యాయులు కూడా 1979లో తీసుకు వచ్చిన 939 జీఓను తిరిగి అమలులోకి తీసుకు రావాలని డిమాండ్ చేస్తున్నారు.

పశు పోషణతో రైతులకు ఆర్థిక బలం : కలెక్టర్

కడప కలెక్టరేట్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ స్థాయిలో పశు పోషణ ద్వారా రైతులను ఆర్థికంగా బలలోపేతం చేయడమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యమని జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో జేడీ శారదమ్మ అధ్యక్షతన పశుసంవర్ధక శాఖ జిల్లా సమీక్షా సమావేశం జరిగింది. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాడి, పశు సంవర్ధకశాఖల ఆవశ్యకతను దృష్టిలో పెట్టుకొని ఎన్‌ఎల్‌ఎం పథకాన్ని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకొని రైతులు ఆర్థికంగా ఎదగాలన్నారు. జిల్లా ఆర్థిక ప్రగతిలో వ్యవసాయ, ఉద్యాన పంటలతో పాటు పశు సంవర్ధక శాఖ కీలకమన్నారు. జిల్లాలో పశు పోషణ, జంతు సంరక్షణ చాలా చక్కగా జరుగుతోందన్నారు. ఈవిషయంలో ప్రత్యేక శ్రద్ధవహిస్తున్న పశు సంవర్ధక శాఖ అధికారులను కలెక్టర్ అభినందించారు. జిల్లాలో కోడిగుడ్ల ఉత్పత్తి చాలా తక్కువగా ఉందని, జిల్లాలో మాసం ఉత్పత్తులను కూడా అధికంగా పెంచాలన్నారు. లైవ్ స్టాక్ మిషన్ ద్వారా రైతులు జిల్లాలో మేలు రకమైన జంతు జాతులను ఉత్పత్తి చేయాలన్నారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా మినీ గోకులాలు, పౌల్ట్రీ, పాల ఉత్పత్తి కేంద్రాల ఏర్పాటు కోసం అవసరం అయిన అనుకూలతలను నివేదించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు ఆనంద్ నాయక్, ఆదిశేషారెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి రాజ్యలక్ష్మి, పశుసంవర్ధక శాఖ డీడీలు, ఏడీలు తదితరులు పాల్గొన్నారు.

వాటర్ గ్రిడ్ పనులను త్వరగా పూర్తిచేయాలి



వాటర్ గ్రిడ్ పనులను పరిశీలిస్తున్న విజయ్ దత్వాలియా

లింగాల, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): పులివెందుల నియోజకవర్గం ప్రజలకు తాగునీరు అందించేందుకు నూతనంగా నిర్మిస్తున్న వాటర్ గ్రిడ్ పనులను త్వరగా పూర్తి చేయాలని హిమాచల్‌ప్రదేశ్ ఆర్‌డబ్ల్యూఎస్ విశ్రాంత చీఫ్ ఇంజనీర్ విజయ్ దత్వాలియా అన్నారు. లింగాల మండల పార్నపల్లె సమీపంలో నిర్మిస్తున్న వాటర్ గ్రిడ్ పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. అనంతరం అక్కులగారిపల్లెలో పర్యటించి ప్రజలకు సరఫరా చేస్తున్న నీటికి నీటిశుద్ధి పరీక్షలు నిర్వహించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ ఏడుకొండలు, ఈఈ విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఇంటర్ ఫలితాల్లో ఆర్టీపీపీ విద్యార్థిని ప్రతిభ



ఎర్రగుంట్ల, ఏప్రి ల్ 22 (ఆంధ్ర జ్యోతి): తెలంగాణ ఇంటర్ ఫలితాల్లో ఆర్టీపీపీకి చెందిన పార్లపల్లె పూజిత 991/1000 మార్కులు సాధించింది. ఈ విద్యార్థిని 10వ తరగతి వరకు ఆర్టీపీపీలోని డీఏవీలో చదివింది. పూజిత తండ్రి రామాంజనేయులు ఆర్టీపీపీలో స్టేజ్-4లో డీఈగా పనిచేస్తున్నారు. పూజిత మంచి మార్కులు సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విశ్రాంత ఎంఈఓపై కేసు

వేంపల్లె, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె విశ్రాంత ఎంఈఓ బండి వీరారెడ్డి, ఆయన కుమారుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రంగారావు తెలిపారు. జడ్పీ బాలుర హైస్కూల్‌కు చెందిన ఉపాధ్యాయుడు జనార్దన్‌రెడ్డి విధులకు ఆటంకం కలిగించారనే ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బాలిక అదృశ్యం

పులివెందుల, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని చిన్నకొండారెడ్డి కాలనీకి చెందిన స్పందన అనే బాలిక అదృశ్యమైనట్లు అర్బన్ సీఐ చాంద్‌బాష తెలిపారు. ఇటీవల ఇంటర్ పూర్తి చేసిన స్పందన సోమవారం అర్ధరాత్రి నుంచి కనిపించడం లేదని బాలిక తండ్రి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని తెలిపారు.

ప్రతీకారంతోనే హత్య

- నలుగురు అరెస్టు
- వివరాలు వెల్లడించిన ఎస్పీ అశోక్‌కుమార్



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్

కడప క్రైం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): కడప బిల్టప్ సర్కిల్‌లోని వైన్ షాపు వద్ద ఈ నెల 15న సాదక్‌వల్లి అనే పండ్ల వ్యాపారిని ప్రతీకారంతోనే దారుణంగా హత్య చేశారు. ఈ కేసులోని నలుగురు నిందితులను తాలుకా పోలీసులు అరెస్టు చేశారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని పెన్నార్ కాన్ఫరెన్స్ హాలులో ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు.

కడప పట్టణంలోని రవీంద్రనగర్‌లో కాటికాపరి వీధికి చెందిన షేక్ సాదక్‌వల్లి పాత బస్టాండులో పండ్ల వ్యాపారం చేసుకుంటూ జీవిస్తుండేవాడు. 2024 సంవత్సరంలో చింపిరి వెంకటేశ్‌ను మద్యం బాటిల్‌తో పొడిచి హత్య చేశాడు. ఈ కేసులో సాదక్‌వల్లి జైలుకు వెళ్లి బెయిలుపై బయటికి వచ్చాడు. అయితే చింపిరి వెంకటేశ్‌ను హత్య చేసినందుకు ప్రతీకారంగా అతని బంధువు రవీంద్రనగర్‌లోని మరాఠీవీధికి చెందిన చప్పిడి రాయప్ప అలియాస్ పెద్దోడు ఈనెల 15న రాత్రి 8గంటలకు సాదక్‌వల్లి బిల్టప్ సర్కిల్‌లోని వైన్ షాపు వద్ద నిలబడి ఉండగా పథకం ప్రకారం తన అనుచరులుతో కలిసి కత్తులతో పొడిచి హత్య చేశారు. ఈ కేసులోని నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు.

22న మంగళవారం మధ్యాహ్నం నిందితులు రామరాజుపల్లెలోని వైజంక్షన్ వద్ద ఉన్నట్లు సమాచారం రావడంతో డీఎస్పీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐలు తులసి నాగప్రసాద్, తాహిర్‌హుసేన్ సిబ్బందితో కలిసి నలుగురిని అరెస్టు చేసి.. వారి వద్ద నుంచి రెండు కత్తులు, మూడు సెల్‌ఫోన్లతో పాటు స్కూటీని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో కృషి చేసిన సీఐ, ఎస్ఐలతో పాటు పోలీసు సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

అరెస్టు అయిన వారి వివరాలు....

సాదక్‌వలి హత్య కేసులో అరెస్టు అయిన వారిలో చప్పిడి రాయప్ప అలియాస్ పెద్దోడు బేల్దారి, కడప మోచంపేటకు చెందిన షేక్ గౌస్‌బాషా అలియాస్ కాలియా బేల్దారి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. మరియాపురానికి చెందిన శీలం బాల స్వామి కారు డ్రైవరుగా, మరాఠవీధికి చెందిన సుంకర వెంకటేశ్ హమాలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరిలో రాయప్ప, గౌస్‌బాషా, బాలస్వామిలపై రౌడీషీట్‌లు ఉన్నాయి. ఇలాంటి వారిపై ప్రత్యేక నిఘా ఉంచుతామని ఎస్పీ స్పష్టం చేశారు.

మహిళ మెడలోని బంగారు గొలుసు అపహరణ

కమలాపురం రూరల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మహిళ మెడలోని బంగారు గొలుసు (సరుడు)ను పట్టపగలే దొంగలు అపహరించుకు వెళ్లిన ఘటన కోగటం గ్రామంలో జరిగింది. గ్రామస్థుల వివరాల మేరకు... మంగళవారం మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో కోగటం గ్రామ సమీపంలోని తమ పొలంలో బండి వెంకటలక్షుమ్మ అనే మహిళ ఒంటరిగా పశువుల మేత కోసం గడ్డిని కోసేందుకు వెళ్లింది. గడ్డి కోస్తుండగా అక్కడ ఎవరూ లేరని గుర్తించిన దుండగుడు ఆమె వద్దకు వచ్చి ఉన్నట్లుండి మెడలోని 2లక్షల విలువైన బంగారు సరుడును లాక్కుని పరారయ్యాడు. ఈ విషయాన్ని బాధితురాలు కుటుంబ సభ్యులకు తెలపడంతో వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ విద్యాసాగర్ తమ సిబ్బందితో హుటాహుటిన చోరీకి గురైన స్థలానికి చేరుకుని పరిశీలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మహిళలు ఒంటరిగా పొలాలు, ఊర్లకు వెళ్లేటప్పుడు బంగారు ఆభరణాలు ధరించి వెళ్లకూడదని సూచించారు.

ప్రేమ విఫలమై యువకుడి ఆత్మహత్య



వెంకట నరసింహులు మృతదేహం

ప్రొద్దుటూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ప్రేమ విఫలమై సానా వెంకట నరసింహులు అనే యువకుడు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన ప్రొద్దుటూరు పట్టణంలో చోటు చేసుకుంది. వన్‌టౌన్ పోలీసుల వివరాల మేరకు.. ఈశ్వర్‌రెడ్డినగర్‌కు చెందిన సానా వెంటరమణ రెండో కుమారుడు వెంకట నరసింహులు (24) చిన్న చిన్న కాంట్రాక్టు పనులు చేసు కుంటూ వుండేవాడు. ఎవరో అమ్మాయిని ప్రేమించాడు. ప్రేమ విఫలమై చాలా రోజుల నుంచి తనలో తానే బాధపడుతూ వుండేవాడు. ఈ నేపథ్యంలో ఈనెల 21 తేదీ రాత్రి 7 గంటలకు ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించి ఆసుపత్రికి తరలించగా డాక్టర్ పరీక్షించి అప్పటికే చనిపోయినట్లు నిర్ధారించారు. సోదరుడు సురేష్ ఫిర్యాదు మేకు వన్‌టౌన్ ఎస్ఐ సంజీవరెడ్డి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పేదలకు నాణ్యమైన విద్యనందించడమే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్సీ



జడ్పీ బాలికల హైస్కూల్ ప్లస్‌లో ప్రతిభ చూపిన విద్యార్థినులకు నగదు బహుమతి అందిస్తున్న ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి

వేంపల్లె, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): పేదలకు నాణ్యమైన విద్యనందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి అన్నారు. వేంపల్లె జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్ ప్లస్‌లో ఇంటర్ బైపీసీలో మండల టాపర్‌గా నిలిచి 695 మార్కులు సాధించిన హేమలతకు, సీఈసీలో 625 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచిన ఏంజల్ ప్రణీతకు రూ.5వేలు చొప్పున నగదు బహుమతులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కళాశాలలకు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఉపాధ్యా యులు వీలైనంత ఎక్కువ మందిని ప్రభుత్వ కళాశాలల్లో చేర్పించేలా కృషి చేయాలన్నారు. అనంతరం ఆయన ఇటీవల ఉపాధ్యాయుల మధ్య జరిగిన ఘర్షణ, కేసుల గురించి వేర్వేరుగా సమావేశం నిర్వహించి ఆరా తీశారు. పిల్లలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా బాధ్యతగా పని చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాసులు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు జీవీ రమణ, ఆర్‌వీ రమేష్, భాస్కర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, మైసూరారెడ్డి, పోతిరెడ్డి శివ తదితరులు పాల్గొన్నారు.

జమిలి ఎన్నికలు అసాధ్యం : తులసిరెడ్డి

వేంపల్లె, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): జమిలి ఎన్నికల ఆలోచన ఒక పిచ్చి తుగ్లక్ ఆలోచన అని, ఇది అనవసరం, అసాధ్య మని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ తులసిరెడ్డి అన్నారు. మంగళవారం వేంపల్లెలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశమంతటా ఒకేసారి లోక్‌సభ, అసెంబ్లీకి , స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహిం చడం సాధ్యం కాదన్నారు. ఇది జరగాలంటే రాజ్యాంగంలో ఆర్టికల్ 83, 85, 142, 144, 356కు రాజ్యాంగ సవరణలు జరగాలి, అది జరగాలంటే లోక్‌సభలో, రాజ్యసభలో మూడిం ట రెండు వంతుల మెజారిటీ కావాలన్నారు. లోక్‌సభలో 362 మంది కావాలి కానీ మోదీ ప్రభుత్వానికి 293 మాత్రమే ఉన్నారన్నారు. రాజ్యసభలో 164 మంది కావాలి 121 మంది మాత్రమే ఉన్నారన్నారు.

బెల్టుషాపులు నిర్వహిస్తే కేసులు తప్పవు

- ఎక్సైజ్ డిప్యూటీ కమిషనరు



సమావేశంలో మాట్లాడుతున్న ఎక్సైజ్ డిప్యూటీ కమిషనరు జయరాజ్

కడప క్రైం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎక్కడైనా బెల్టు షాపులు నిర్వహిస్తే కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని... మద్యం దుకాణదారులు నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే చర్యలు తీసుకోవాలని ప్రొవిజన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనరు జయరాజ్ సిబ్బందిని ఆదేశించారు. తన కార్యాలయంలో మంగళవారం ఎక్సైజ్ అధికా రులతో సమీక్ష నిర్వహించారు. మద్యం దుకాణాలను తనిఖీ చేసి స్టాకు వివరాలను పరిశీలించాలని... ఎవరైనా ఎమ్మార్పీ ధరల కంటే ఎక్కువకు అమ్మితే వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నాటుసారా నిర్మూలనపై నవోదయ కార్యక్రమాలు నిర్వహించి.. జిల్లాను సారారహిత జిల్లాగా తయారు చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని సూచించారు. ఎక్సైజ్ కేసులు ఏవైనా పెండింగులో ఉంటే త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం ఆయన పలు రికార్డులను పరిశీలించారు. ఎక్సైజ్ అధికారులు చంద్రశేఖర్‌రెడ్డి, రవికుమార్, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

అంతరాయం లేకుండా విద్యుత్ అందించాలి : ఎస్ఈ



విద్యుత్ అధికారులు సిబ్బంతో సమీక్షిస్తున్న ఎస్ఈ రమణ

ప్రొద్దుటూరు , ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఒక్క క్షణం కరెంటు పోయినా ప్రజలు భరించే స్థితిలో లేరని.. అంతరాయం లేని నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని ఏపీఎస్పీడీసీఎల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ రమణ ఆదేశించారు. మంగళవారం ప్రొద్దుటూరు సబ్‌డివిజన్ పరిధిలోని రామేశ్వరం సబ్‌స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. భద్రతా నియమాలు ఎలా పాటిస్తున్నారో పరిశీలించారు. మధ్యాహ్నం డివిజన్ కార్యాలయంలో విద్యుత్ అధికారులతో సమీక్షా సమా వేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ నాటికి వ్యవసాయ సర్వీ సులు విడుదల చేయాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు, వైర్లు అందుబాటులో వున్నాయా లేదా విచారించారు. ఏప్రిల్, మే నెలలో అధికారులు సిబ్బందికి పని రెట్టింపు ఉంటుందన్నారు. ప్రకృతి వైపరీత్యాలు, ఈదురు గాలులు, ఉరుములు మెరుపులతో కూడిన వర్షంతో విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలన్నారు. వాలిపోయిన స్తంభాలు, లూజులైన్లు ఎప్పటికప్పుడు సరిచేయాలన్నారు. తక్కువ ఎత్తులో ఉన్న లైన్లను గుర్తించి వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ బిల్లులు సకాలంలో వసూళ్లకు చర్యలు తీసుకుంటూ మొండి బకాయిలపై కఠినంగా వ్యవహరించాలన్నారు. సమావేశంలో డీఈ రమణారెడ్డి, ఏడీఈలు, ఏఈలు ఈఆర్వో సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యత లేని అరటి మొక్కలు... నష్టపోతున్న రైతన్నలు



అరటి తోటలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త రేష్మా, హెచ్ఓ మల్లేశ్వర్‌రెడ్డి



గెల వేయకనే నేలకొరిగిన అరటి చెట్టు

సింహాద్రిపురం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మండలంలో అరటి సాగు చేస్తున్న రైతులకు నర్సరీల నుంచి నాణ్యత లేని అరటి మొక్కలను సరఫరా చేయడంతో పంట దిగుబడి రాక రైతులు తీవ్ర నష్టాల పాలయ్యారు. వివరాల్లోకెళితే... ముసల్‌రెడ్డిపల్లెకు చెందిన సింగం వాసుదేవరెడ్డి తనకున్న నంద్యాలంపల్లి పొలంలో మూడున్నర ఎకరాల్లో సమారు 5వేల అరటి మొక్కలు సాగు చేశాడు. రైతు ఓ సంస్థకు చెందిన జి9 రకం మొక్కలు కావాలని ఆర్డర్ చేశాడు. కానీ ఆ డీలర్ ఆ మొక్కలు అని చెప్పి.. వాటికి బదులుగా రైతుకు తెలియకుండా మరో రకం మొక్కలను అందజేశారు. పంట సాగు మొదలైన 6 నెలల నుంచి అరటి చెట్లు విరిగి కింద పడటం, 7 నెలలకు పూత దశకు రావాల్సిన చెట్లు 10వ నెల వరకు పూతకు రాకపోవడం జరిగింది. ఏడాది గడచినా గెలలు కోతకు రాకపోవడంతో రైతు డీలర్‌ను సంప్రదిస్తే అతని నుంచి సరైన సమాధానం రాలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. చేసేది లేక పులివెందుల అరటి పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలను సంప్రదించాడు. దీంతో శాస్త్రవేత్త డాక్టర్ రేష్మా మంగళవారం అరటి తోటను పరిశీలించారు. వేరు వ్యవస్థకు సంబంధించిన శాంపుల్స్ తీసుకుని ల్యాబ్‌కు పంపి పరీక్షలు నిర్వహించి తగిన నివేదికలు అందజేస్తామని శాస్త్రవేత్త తెలిపారు. నివేదికలు రాగానే ఆ కంపెనీపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. హెచ్ఓ మల్లేశ్వర్‌రెడ్డి, వీహెచ్ఏ ప్రత్యూష, రైతులు పాల్గొన్నారు.

పంట సాగుకు రూ.8లక్షలు ఖర్చు చేశా...



అధిక దిగుబడి సాధించాలని రూ.8లక్షలు వెచ్చించి పంట సాగు చేశాను. ఒక్క రూపాయ కూడా రాలేదు. ఇలాంటి నకిలీ నర్సరీలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. పంట నష్ట పరిహారం అందించి ఆదుకోవాలి.

- వాసుదేవరెడ్డి, రైతు, ముసల్‌రెడ్డిపల్లి

వెల్ఫేర్ అసిస్టెంట్ సస్పెన్షన్

పెద్దతిప్పసముద్రం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లెల సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న రవిని సస్పెండ్ చేసినట్లు ఎంపీడీవో అబ్దుల్‌కలాం ఆజాద్ తెలిపారు. ఈ నెల 1న పెన్షన్లను అందించేందుకు గ్రామంలోకి వెళ్లి ఇద్దరు పెన్షన్‌దారుల వద్ద వేలి గుర్తులు తీసుకుని వారికి డబ్బులు ఇవ్వలేదని బాధితులు సర్పంచ్, కార్యదర్శికి ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో ఈ నెల 18న "వృద్ధులను మోసం చేస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్" శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైంది. స్పందించిన కలెక్టర్ మంగళవారం ఆ ఉద్యోగిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎంపీడీవో తెలిపారు.

కుటుంబ కలహాలతో యువకుడు మృతి

మదనపల్లెఅర్బన్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో యువకుడు ఉరి వేసుకుని మృతిచెందిన సంఘటన మదనపల్లె పట్టణం, అమ్మచెరువుమిట్టలో చోటు చేసుకుంది. తాలుకా పోలీసుల కథనం మేరకు అమ్మచెరువుమిట్టకు చెందిన ఆటో డ్రైవర్ షబ్బీర్ (42) కుటుంబ గొడవలతో మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో ఉరివేసుకున్నాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన డాక్టర్లు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఇతనికి భార్య, నలుగురు పిల్లలున్నారు. ఈ మేరకు తాలుకా పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

8 మంది జూదరుల అరెస్టు

● రూ.70 వేలు స్వాధీనం

పెద్దమండ్యం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని సి.గొల్లపల్లి సమీపంలో జూదరుల స్థావరంపై రాయచోటి స్పెషల్ పార్టీ పోలీసులు, స్థానిక పోలీసులు మంగళవారం దాడులు నిర్వహించారు. జూదం ఆడుతున్న 8 మందిని అరెస్టు చేసి వారి నుంచి రూ.70 వేలు నగదు, 8 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పీవీ రమణ వెల్లడించారు.

చోరీ కేసు నమోదు

పెద్దమండ్యం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): మండలంలో చోరీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పీవీ రమణ తెలిపారు. మండలంలోని పాపేపల్లి గ్రామ పంచాయతీ సాయిబాబా గుడి వద్ద పండ్ల దుకాణం నిర్వహిస్తున్న సుజాతమ్మ మెడలోని 3 తులాల బంగారు గొలుసును గుర్తు తెలియని దుండగులు ద్విచక్ర వాహనాల్లో వచ్చి లాక్కెళ్లినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నేరాల నియంత్రణకే కార్డెన్ సెర్చ్

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణకే కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు మదనపల్లె డీఎస్పీ మహేంద్ర తెలిపారు. మంగళవారం పట్టణంలో శివాజీనగర్ ప్రాంతాల్లో సీఐలు రామచంద్ర, ఎరిసావలి, జీవన్‌బాబులు ఇందులో పాల్గొని ప్రతి ఇంటిని సర్చ్ చేశారు. 22 ద్విచక్రవాహనాలు, రెండు ఆటోలను స్వాధీనం చేస్తునట్లు డీఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ వాహనాలకు పూర్తి స్థాయిలో రికార్డులు ఉండాలని తెలిపారు.

పర్యావరణ పరిరక్షణే ధ్యేయం

మదనపల్లెటౌన్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా ప్రతిఒక్కరూ బాధ్యత వహించాలని కరస్పాండెంట్ ఆర్.గురుప్రసాద్ పేర్కొన్నారు. అంతర్జాతీయ ధరిత్రి దినోత్సవం సందర్భంగా స్థానిక జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ వాడకం వలన పర్యావరణంలో కాలుష్యం విపరీతంగా ఏర్పడి ఓజోన్ పొర దెబ్బతీస్తోందన్నారు. దీనివలన మానవాళికి తీవ్ర నష్టం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమాదేవి, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ రమ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

రుణాలకు దరఖాస్తు చేసుకోండి

● ఎంపీడీవో దిలీప్‌కుమార్

బి.కొత్తకోట, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): మండలంలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా అందించనున్న సబ్సిడీ రుణాలకోసం ఆయా బ్యాంకులకు మంజూరైన యూనిట్లకు మాత్రమే ఆశావహులు దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీవో దిలీప్‌కుమార్ పేర్కొన్నారు. ఇండియన్‌బ్యాంకులో వర్మీ కంపోస్టు రూ.2.50 లక్షలు, చేపలపెంపకం రూ.3.50 లక్షలు, బేకరీ రూ.3.60 లక్షలు, నీటిశుద్ధి కేంద్రం రూ.3.80లక్షలు, కొబ్బరి ఉత్పత్తులు రూ.4 లక్షలు, త్రీవీలర్ ఆటో రూ.3.00లక్షలకు ఒక్కో యూనిట్ మాత్రమే ఉందన్నారు. అర్హత, ఆసక్తి గల ఎస్సీ నిరుద్యోగ అభ్యర్థులు ఓబీఎంఎంఎస్ సైట్‌లో ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

భూముల రీసర్వేపై అవగాహన సదస్సు

రామసముద్రం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని మినికి గ్రామంలో రెవెన్యూ అధికారులు భూ రీసర్వేపై మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ మేరకు రెవెన్యూ అధికారులు మాట్లాడుతూ గ్రామంలో ఉన్న భూములను సర్వే చేసి రైతులకు పట్టాదార్ పాస్ పుస్తకాలను మంజూరు చేస్తామన్నారు. భూముల రీ సర్వేపై రైతుల్లో ఉన్న అపోహలను తొలగించేందుకు అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నిరుపేదల కోసమే స్టెనీ వైద్యసేవలు

● సూపరింటెండెంట్ డాక్టర్ రవికుమార్



సూపరింటెండెంట్ డాక్టర్ రవికుమార్

వాల్మీకిపురం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాస్పత్రులలో నిరుపేదల కోసం అందిస్తున్న వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వాల్మీకిపురం ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవికుమార్ పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వాస్పత్రిలో స్టెనీ వైద్య సేవలపై ఆయన ప్రజలకు తెలియజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ వ్యక్తి గుండెపోటుకు గురైన మొదటి 3గంటలలోపు ప్రభుత్వాస్పత్రికి చేరుకోవడం ద్వారా థ్రాంబోలైసిస్ చికిత్సలు చేయడం ద్వారా మనిషిని ప్రాణాపాయం నుంచి కాపాడవచ్చనన్నారు. తొలుత ఈసీజీ చికిత్సల ద్వారా రాష్ట్రంలో స్టెనీ హబ్‌కు సమాచారం అందించి వారి సూచనల మేరకు చికిత్సలు అందిస్తామన్నారు. కార్పొరేట్ ఆస్పత్రులలో డబ్బులతో కూడుకున్న వైద్యసేవలు ప్రస్తుతం ప్రభుత్వాస్పత్రుల్లో ఉచితంగా అందిస్తున్నామని, గుండెపోటుకు సంబంధించి రూ.45 వేలు విలువ గల ఇంజక్షన్, మందులు ఉచితంగా అందిస్తూ వైద్య చికిత్సలు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ఆరోగ్యశ్రీ ద్వారా జనరల్ సర్జరీలు, తదితర ఆపరేషన్లు మెరుగ్గా ఉచితంగా చేయడం జరుగుతోందని ఆస్పత్రికి వచ్చే సమయాన ప్రతి రోగి తప్పనిసరిగా ఆధార్, ఆరోగ్యశ్రీ కార్డులు వెంట తెచ్చుకోవాలన్నారు. సాధారణ కాన్పులకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తూ సిజేరియన్ విధానం తగ్గించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని ప్రజలు కూడా సహకరించాలని కోరారు. ఆస్పత్రిలో పాముకాటు, కుక్కకాటు, అన్ని అత్యవసర సమయాల్లో కూడా అవసరమయ్యే మందులు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజల అవసరం మేరకు ఆస్పత్రిలో ఓఆర్ఎస్ అందుబాటులో ఉన్నాయని, అవసరమైన వారు పొందవచ్చన్నారు.

పొజిషన్ సర్టిఫికెట్లు రిజెక్ట్ చేయొద్దు

● ఎమ్మెల్యే షాజహాన్‌బాషా



అధికారులతో సమీక్షిస్తున్న షాజహాన్‌బాషా

మదనపల్లెటౌన్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): హౌసింగ్ స్కీమ్ కింద ఇళ్ల స్థలాలు వున్న అర్హులకు రెవెన్యూ అధికారులు పొజిషన్ సర్టిఫికెట్లు ఇవ్వకుండా రిజెక్ట్ చేయడం సరికాదని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అసహనం వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక ఎమ్మెల్యే నివాసంలో హౌసింగ్ ఈఈ రమేశ్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ప్రమీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో 500 మందికి పొజిషన్ సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని బాధితులు తన వద్ద ఫిర్యాదు చేశారన్నారు. దీనిపై ఆయా తహసీల్దార్లు విచారించి హౌసింగ్ ఇళ్లు మంజూరైన వారికి, అర్హులైతే పొజిషన్ సర్టిఫికెట్లు మంజూరు చేయాలని ఆదేశించారు. పట్టణ శివారులోని బీకేపల్లె కాలనిలో రెవెన్యూ అధికారులు అర్హులను గుర్తించి ఇళ్ల పట్టాలు కేటాయించాలన్నారు. మదనపల్లె పట్టణంలో హౌసింగ్ స్కీమ్ కింద దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులను గుర్తించాలని మున్సిపల్ కమిషనర్ ప్రమీలకు సూచించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ ధనంజయులు, హౌసింగ్ ఏఈ దీనదయాళ్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల ప్రచారం

మదనపల్లెఅర్బన్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): తమ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని పట్టణంలో స్థానిక జడ్పీహైస్కూల్ ఉపాధ్యాయులు మంగళవారం పట్టణంలో ప్రచారం నిర్వహించారు. ఉపాధ్యాయులు కరపత్రాలను పంచి తల్లిదండ్రులతో మాట్లాడి పిల్లల వివరాలను నమోదు చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో క్రమశిక్షణతో కూడిన నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయలు పఠాన్ మహమ్మద్‌ఖాన్, రమణ పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ

మదనపల్లె, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): భారత సాంస్కృతిక సహకార స్నేహసంఘం (ఐఎస్‌సీయూఎఫ్) పోస్టర్లను మంగళవారం స్థానిక ఎమ్మెల్యే ఎం.షాజహాన్‌బాషా చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ నెల 26, 27వ తేదీలలో మదనపల్లెలో జరిగే మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంస్థ రాష్ట్ర కార్యదర్శి తుంగా శ్రీధర్‌రావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.వి.శివకుమార్, ఆర్గనైజింగ్ కార్యదర్శి డి.రామచంద్రయ్య, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ నేతల సంబరాలు



కేక్ కట్ చేస్తున్న ఎంఎస్పీ జాతీయ నాయకుడు నరేంద్రబాబు

ములకలచెరువు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ముప్పై ఏళ్ల ఉక్కు సంకల్పంతో కూడిన మందకృష్ణమాదిగ పోరాటం, ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు సహకారంతో ఎస్సీ వర్గీకరణకు ఆర్డినెన్స్ జారీ కావడంతో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. స్థానిక బస్టాండు సర్కిల్‌లో ఎంఎస్పీ జాతీయ నాయకుడు నరేంద్రబాబు మాదిగ, ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రతాప్ కుమార్, ఇన్‌చార్జి తిరుపాల్‌లు కేక్‌ను కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు. అలాగే మందకృష్ణమాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అంతకుమునుపు భారీ ఎత్తున బాణాసంచా కాల్చారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ ఈశ్వరప్ప, జిల్లా నాయకులు వెంకటప్ప, చౌడప్ప, టీచర్ ఆదినారాయణ, నాయకులు తోపు రమణ, బయన్న, పెద్ద అంజనేయులు, ముత్యాల వెంకటరమణ, తోపు పారేసు, రామచంద్ర, ప్రసాద్‌కుమార్ పాల్గొన్నారు.

తంబళ్లపల్లె: ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ 30 ఏళ్ల సుదీర్ఘ పోరాట ఫలితం కారణంగానే ఎస్సీ వర్గీకరణ సాధించగలిగామని తంబళ్లపల్లె ఎంఆర్‌పీఎస్ ఇంచార్జి వేటా మల్లికార్జున అన్నారు. ఎస్సీ వర్గీకరణకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేయడంపై ఎంఆర్‌పీఎస్, ఎమ్మెస్పీ, కూటమి నాయకులు తంబళ్లపల్లెలో సంబరాలు చేసుకున్నారు. మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. బాణసంచా పేల్చి కేకు కట్‌చేసి ప్రజలకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా మల్లికార్జున మాట్లాడుతూ..తమ అధినేత మందకృష్ణ మాదిగ చేసిన నిరంతర కృషి, పోరాటం ఫలితంగానే ఎస్సీ వర్గీకరణను సాధించగలిగామన్నారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్, ఎమ్మెస్పీ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

బాణాసంచా గోడౌన్ల తనిఖీ



గోడౌన్లలోని రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

పీలేరు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): పీలేరు పట్టణ పరిధిలోని బాణాసంచా హోల్‌సేల్ గోడౌన్లను అధికారులు మంగళవారం తనిఖీ చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పీలేరు తహసీల్దారు భీమేశ్వర రావు, కార్మిక శాఖాధికారి ఆనంద్ బాబు, అగ్నిమాపక శాఖాధికారి మస్తాన్, ఎస్ఐ బాలకృష్ణ టీముగా ఏర్పడి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు భీమేశ్వర రావు మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన భద్రతా మార్గదర్శకాలను బాణాసంచా వ్యాపారులు పాటిస్తున్నారో లేదో నిర్ధారించడానికి తనిఖీలు చేపట్టామన్నారు. పీలేరు మండలంలో అనుమతులు పొందిన రెండు హోల్‌సేల్ గోడౌన్లు ఉన్నాయని, రెండింటిలోనూ ప్రమాణాలు పాటిస్తున్నారని తెలిపారు. తమ తనిఖీల సారాంశాన్ని నివేదిక రూపంలో ఉన్నతాధికారులకు పంపుతామన్నారు.

మహిళపై కేసు నమోదు

గుర్రంకొండ, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఓ మహిళపై కేసు నమోదు చేసినట్లు వాల్మీకిపురం ఎక్సైజ్ సీఐ లత తెలిపారు. మండంలోని నడిమిఖండ్రిగ పంచాయతీ గెరికుంటపల్లెకు చెందిన ఓ మహిళ మద్యం విక్రయిస్తుండడంతో దాడులు చేసి పట్టుకొన్నారు. ఆమె వద్ద నుంచి 15 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం: సీడీపీవో

పీలేరురూరల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారం తీసుకోవడం వల్ల వివిధ వ్యాధుల నుంచి రక్షణ పొందడమే కాక సంపూర్ణ ఆరోగ్యంతో జీవించవచ్చని ఐసీడీఎస్ పీలేరు ప్రాజెక్ట్ సీడీపీవో రాజమ్మ అన్నారు. మంగళవారం పీలేరులో పౌష్టికాహార ముగింపు పక్షోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతిరోజూ గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు తీసుకునే ఆహారంలో చిరు ధాన్యాలు ఉండేలా చూసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీలేరు, కేవీపల్లె, కలకడ మండలాలకు చెందిన సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ వర్కర్లు, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

అనీమియా వ్యాధిపై అవగాహన ఉండాలి

గుర్రంకొండ, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): సికిల్ సెల్ అనీమియా వ్యాధి లక్షణాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని డాక్టర్ రవీంద్ర నాయక్ అన్నారు. మండలంలోని సరిమడుగు పంచాయతీ గుండ్లగుట్టతాండలో మంగళవారం అనీమియా వ్యాధిపై వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సికిల్ సెల్ అనీమియా వ్యాధి లక్షణాలను ప్రజలకు వివరించారు. అనంతరం 39 మంది పిల్లలు, పెద్దలకు రక్త పరీక్షలను నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్‌ఎడుకేటర్ మహ్మద్‌రఫీ, నాగిరెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

26న శనిత్రయోదశి వేడుకలు

వాల్మీకిపురం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం పడమర పొలిమేరలోని ధర్మపథం సమూహాలయంలో ఈ నెల 26న శనివారం షిరిడీసాయి సాలిగ్రామ తిరునారాయణ ధార్మిక సేవా ట్రస్టు ఆధ్వర్యంలో శనిత్రయోదశి వేడుకలు నిర్వహించనున్నట్లు ట్రస్టు వ్యవస్థాపకులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు పేర్కొన్నారు. శనిత్రయోదశి నాడు ఆలయంలోని శనేశ్వరస్వామికి మహాతైలాభిషేకం ఏకవార రుద్రాభిషేకం ఉంటాయని, భక్తులు హాజరై స్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు.

యువకుడికి గాయాలు

గుర్రంకొండ, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): కడప పట్టణానికి చెందిన హరీష్(30) ద్విచక్ర వాహనంలో కడప నుంచి బెంగుళూరుకు బయలుదేరాడు. యువకుడి ద్విచక్ర వాహనాన్ని చెర్లోపల్లె కోన క్రాస్ వద్ద మదనపల్లె నుంచి రాయచోటి వైపు వెళుతున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో యువకుడికి రెండు కాళ్లు దెబ్బతిన్నట్లు పోలీసులు తెలిపారు. ద్విచక్ర వాహనం నుజ్జు నుజ్జు అయింది. గాయపడిని హరీష్‌ను 108లో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ మధురామచంద్రుడు తెలిపారు.

జీవకోటి మనుగడకు చెట్లే ఆధారం

పీలేరురూరల్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): జీవకోటి మనుగడకు చెట్లే ఆధారమని పీలేరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.నటరాజన్ అన్నారు. మంగళవారం పాఠశాలలో ప్రపంచ ధరిత్రీ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. సమావేశంలో మాట్లాడుతూ పుడమి తల్లిని కాపాడుకోవాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందని, ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌జీసీ కోఆర్డినేటర్ మురళి, ఉపాధ్యాయులు గౌస్, జనార్ధన్‌రెడ్డి, యర్రయ్య, రమణారెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తిప్పన్న ఏకగ్రీవ ఎన్నిక



రామసముద్రం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెంబకూరు గ్రామ పంచాయతీ కేంద్రంలో గడ్డి ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడిగా తిప్పన్న మంగళవారం ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారి ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాగా ఉపాధ్యక్షుడిగా ఒ.నాగరాజు, అలాగే వి.మనోహర, కె.మోహన్‌రెడ్డి, ఎం.వెంకటరమణ, ఒ.నాగరాజ, కె.వెంకటేష్, టి.శివకృష్ణ, బి.కృష్ణమరాజు, బి.తిప్పన్న, జి.నాగరాజను డైరెక్టర్లుగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంతో మోటార్ వెలికితీత



మోటార్‌ను వెలికి తీస్తున్న దృశ్యం

పెద్దతిప్పసముద్రం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రంగసముద్రం పంచాయతీ సాలేవాండ్లపల్లెలో పంచాయతీ తాగునీటి బోరుబావిలో ఇరుక్కుపోయిన బోరు మోటార్ పంప్‌సెట్‌ను కర్నాటకలోని మెకానిక్‌లు వెలికితీశారు. స్థానిక పంచాయతీ అధికారులు ఎంత ప్రయత్నించినా సాధ్యం కాకపోవడంతో మిన్నకుండిపోయారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్పందించి కర్నాటక రాష్ట్రంలోని చింతామణిలో ఉన్న బోరు మెకానిక్‌లు సాంకేతిక పరిజ్ఞానంతో కెమెరాల ద్వారా స్కానింగ్ చేసి వెలికితీశారు. సాలేవాండ్లపల్లెలోని గత రెండు నెలల క్రితం బోరుబావిలోకి మోటర్, పంప్‌సెట్‌ను దించే క్రమంలో 120 అడుగుల లోతులో లోపల కురుకుపోయింది ఎంతకి రాకపోవడంతో మంగళవారం కర్నాటక నుంచి వచ్చిన మెకానిక్‌లు ఎట్టకేలకు మోటర్, పంప్‌సెట్‌ను వెలికి తీసేశారు. అదే విధంగా పీటీఎంలోని పెద్దకాలువ గడ్డలో గత మూడేళ్ల క్రితం పంచాయతీకి సంబంధించిన బోరు బావిలో ఇరుక్కుపోవడంతో పంచాయతీ అధికారులు అలాగే వదిలేశారు. మంగళవారం బోరు మోటర్‌లో స్కానింగ్ ద్వారా పరిశీలించి గోరుబావిలో 200 అడుగుల కింద మోటర్‌కు పంప్ సెట్‌కు చెట్ల ఏర్లు చూట్టేయడంతో కూరుకుపోయినట్లు గుర్తించారు. సాంకేతికతతో రెండు రోజుల్లో వెలికితీస్తామని మెకానిక్‌లు తెలిపారు.

ప్రశాంతమైన జీవనం సాగించాలి

● డీఎస్పీ మహేంద్ర



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ

బి.కొత్తకోట, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): క్షణికావేశంలో నేరాలకు పాల్పడి కేసులలో ఇరుక్కున్న రౌడీషీటర్లు అందరూ సత్ప్రవర్తనతో ప్రశాంతమైన జీవనం సాగించాలని మదనపల్లి డీఎస్పీ మహేంద్ర పేర్కొన్నారు. మంగళవారం ఆయన బి.కొత్తకోట పోలీస్‌స్టేషన్‌ను పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. నేరాల అదుపు, లాఅండ్ ఆర్డర్ అమలుపై సిబ్బందితో సమీక్షించారు. అనంతరం మండల పరిధిలోని రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఒక్కొక్కరినీ ప్రత్యేకంగా పలుకరించి వారి వివరాలు ఆరా తీశారు. ప్రస్తుతం వారు ఏపని చేస్తున్నారు, వారి ప్రవర్తనలో మార్పు ఉందా..పరివర్తన వచ్చిందా అనే విషయాలను పరిశీలించారు. మీపై ఎల్లప్పుడూ పోలీస్ నిఘా వుంటుందని, ఎటువంటి నేరాలకు పాల్పడకుండా జాగ్రత్తగా వుండాలని హెచ్చరించారు. సీఐ జీవన్ గంగనాథ్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

రీ-సర్వేలో జాగ్రత్తలు పాటించాలి



రైతుల పొలాల్లో సర్వే చేపడుతున్న రెవెన్యూ అధికారులు

నిమ్మనపల్లి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మండలంలో జరుగుతున్న రీ-సర్వేలో ఎలాంటి తప్పులు జరగకుండా సిబ్బంది జాగ్రత్తలు పాటించాలని తహసీల్దార్ అమరనాధ్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మాచిరెడ్డిగారిపల్లి రెవెన్యూ గ్రామంలో మొత్తం 1750 ఎకరాల భూమిని జనవరి 20 నుంచి 4టీమ్ ద్వారా రీ-సర్వే చేపట్టామని ఈ సర్వేలో ముందుగా విలేజ్ బౌండరీ, బ్లాక్ బౌండరీలను చేపట్టి ఫిబ్రవరి 10 నుంచి ప్లాటెడ్ గ్రౌండ్ ట్రెడ్డింగ్ ప్రారంభించినట్లు తెలిపారు. అయితే భూముల కొలతలలో అభ్యంతరం వున్న రైతుల వద్ద నుంచి వినతులు స్వీకరించినట్లు తెలిపారు. నెల రోజుల లోగా మాచిరెడ్డిగారిపల్లి గ్రామంలో సర్వేను పూర్తి చేస్తామని దీని అనంతరం రెడ్డివారిపల్లి గ్రామంలో రీ-సర్వే చేపట్టనున్నామని, ఇప్పటికే రెడ్డివారిపల్లి గ్రామానికి 14 టీమ్‌లను కేటాయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్వేయర్లు గోపి, మనోజ్, వీఆర్‌వోలు హేమాంబర్‌రెడ్డి, నాగరాజ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు మెగా డీఎస్సీ వరం



విలేకర్లతో మాట్లాడుతున్న రమేశ్

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మెగా డీఎస్సీ వేలాది మంది నిరుద్యోగులకు గొప్ప వరమని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి మార్పురి రమేశ్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక మార్పురి వీధిలోని కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనలో ఒక్క ఉపాధ్యాయ పోస్టు కూడా భర్తీ చేయలేదన్నారు. కానీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ నాయకులు రాజేష్, గౌతమ్‌రెడ్డి, రెడ్డిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో తల్లీబిడ్డల ఆరోగ్యం

● సీడీపీవో భాగ్యమ్మ

బి.కొత్తకోట, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారంతో తల్లీబిడ్డల ఆరోగ్యం పదిలంగా వుంటుందని బి.కొత్తకోట ప్రాజెక్ట్ సీడీపీవో భాగ్యమ్మ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని గట్టు-1 అంగన్వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. సెంటర్ పరిధిలోని గర్భిణీలు, బాలింతలను సమావేశపరిచి ప్రభుత్వం అందిస్తున్న పోషక పదార్థాలను అలంకరణగా ప్రదర్శించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జయరాణి, ఎఎన్‌ఎం మాలతి, అంగన్వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

కార్మిక వర్గ శ్వాస.. కామ్రేడ్ లెనిన్

● వీసీకే పార్టీ రాష్ట్ర నేత పీటీఎం శివప్రసాద్



లెనిన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న శివప్రసాద్, తదితరులు

మదనపల్లె, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): రష్యన్ విప్లవకారుడు కామ్రేడ్ లెనిన్, కార్మిక వర్గానికి శ్వాస లాంటి వారని వీసీకే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీటీఎం శివప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక బాస్ కార్యాలయంలో మంగళవారం లెనిన్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం శివప్రసాద్, ప్రజాకవి పోతబోలు రెడ్డెప్ప మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బాస్‌నేతలు నీరుగట్టి రమణ, చాట్ల బయన్న, బ్యాంక్ రెడ్డెన్న, ఉద్యమ గాయకుడు సొన్నికంటి రెడ్డెప్ప, వీసీకే పార్టీ పట్టణ అధ్యక్షుడు బురుజు రెడ్డెప్రసాద్, సింగన్న, ఆర్.నారాయణ, డి.రమణ, జి.వి.రమణ, తదితరులు పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకోం

● జనసేన నేత తోట గిరిధర్



ములకలచెరువు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకోమని తంబళ్లపల్లె నియోజకవర్గ జనసేన పార్టీ నేత తోట గిరిధర్ పేర్కొన్నారు. ములకలచెరువులో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మాజీ మంత్రి నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడితే మంచిదన్నారు. తిరుమల గోశాలలో ఆవుల మృతిపై రాజకీయం చేస్తూ పవన్‌కళ్యాణ్, ఆయన కుటుంబంపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే సహించమన్నారు. మరో సారి అనుచిత వ్యాఖ్యలు చేస్తే తగిన బుద్ధి చెబుతామన్నారు. ఈ సమావేశంలో పలువురు పవన్‌కళ్యాణ్ అభిమానులు పాల్గొన్నారు.